
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సంగారెడ్డి

20

గురువారం 31 ఆగస్టు 2017


# 'మిషన్ భగీరథ' అద్భుతం



నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న మధ్యప్రదేశ్ జల్‌నిగమ్ ఇంజనీర్ల బృందం

- మేమూ అమలుచేస్తాం
- 'మధ్యప్రదేశ్' ఇంజనీర్ల బృందం కితాబు
- పెద్దారెడ్డిపేట నీటి శుద్ధి కేంద్రం పరిశీలన
- డిసెంబరు నాటికల్లా ప్రజలకు తాగునీరు
- 'ఎంపీ' ఇంజనీర్లకు వివరించిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

10 లో

## మాంసం దిగుబడులను

# పెంచుతాం

- రాష్ట్రాన్ని మాంసపు హబ్‌గా మారుస్తాం
- జోగిపేటలో ఫిష్ మార్కెట్‌కు రూ.15 లక్షలు
- 15.36 లక్షల గొర్రెలు పంపిణీ చేశాం
- ఈసారి70 కోట్ల చేపపిల్లలు వదులుతాం
- వచ్చే ఏడాది కొర్రమీను సీడ్
- బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం
- త్వరలో మత్స్యకార సంఘాలకు కొత్త కమిటీలు
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్
- ఘనంగా సింగూరులో చేప పిల్లల విడుదల

5



రొయ్యను పరిశీలిస్తూ...



సింగూరు ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, చిత్రంలో ఎమ్మెల్యే బాబూమోహన్

రాష్ట్రాన్ని 60 ఏళ్ల పాటు పాలించిన పార్టీలు కులవృత్తులను సర్వనాశనం చేశాయి. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు వాటి పునరుజ్జీవనానికి బడ్జెట్‌లో వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించారు. గొల్ల, కుర్మ, యాదవులను ఆదుకునేందుకు గొర్రెల పంపిణీ చేపట్టారు. ఇప్పుడు గంగపుత్ర, ముదిరాజ్‌లను ఆదుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా 70 కోట్ల చేపపిల్లలను ఉచితంగా ఇస్తున్నారు. రాష్ట్రాన్ని మాంసపు హబ్‌గా మారుస్తున్నాం. మత్స్యకారుల కోసం ప్రత్యేక సహకార సంఘాలను ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరినీ సభ్యులుగా చేరుస్తాం. మత్స్యకారులు ఇక నుంచి చేపలను మురుగు కాల్వల పక్కన విక్రయించాల్సిన అవసరం లేదు. వారి కోసం ప్రత్యేకంగా మొబైల్ స్టాళ్లను రాయితీపై ఇస్తున్నాం. ప్రభుత్వం తరఫున మార్కెటింగ్ చేస్తాం. సంగారెడ్డి, సదాశివపేటలో ఫిష్ మార్కెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశాం.

*- తలసాని శ్రీనివాస్‌యాదవ్, పశుసంవర్ధక శాఖ మంత్రి*



## వాణిజ్య పంటలు

# @ జహీరాబాద్

- డివిజన్ పరిధిలో అధికంగా ఎర్రనేలలు
- వాణిజ్య పంటలకు అనుకూలం
- భారీగా అల్లం, పసుపుతో పాటు పండ్ల తోటల పెంపకం
- వాతావరణం అనుకూలిస్తే రైతుకు కాసుల గలగల

5





జహీరాబాద్‌లో రైతులు సాగుచేసిన అల్లం, చెరకు, బొప్పాయి పంటలు

ఇంటర్వ్యూ



# గడువులోగా గొర్రెల పంపిణి పూర్తి చేస్తాం

● జిల్లా పశువైద్యాధికారి అశోక్‌కుమార్

**మెదక్ రూరల్ :** జిల్లాలో గొర్రెల పంపిణీ గడువులోగా పూర్తి చేస్తామని, ఇప్పటి వరకు 20 శాతం పంపిణీ చేశామని, వచ్చే మార్చి నాటికి లక్ష్యం మేరకు లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ అందజేస్తామని జిల్లా పశువైద్యాధికారి అశోక్ కుమార్ 'ఆంధ్ర జ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

**జిల్లాలో ఎన్ని గొర్రెల యూనిట్లు ఉన్నాయి ?**

జిల్లాలో 1,0140 గొర్రెల యూనిట్లను ఈ సంవత్సరం పంపిణి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 2,050 యూనిట్ల పంపిణీ పూర్తి యింది. మిగతా వాటిని కూడా అనుకున్న గడువు వరకు అందజేస్తాం.

**లబ్ధిదారులకు అందించడంలో ఆలస్యం జరుగుతుంది కదా ?**

గొర్రెల పంపిణీలో ఎలాంటి ఆలస్యం జరగడంలేదు. డిసెంబర్ వరకు గడువు అని భావిస్తున్నారు. వచ్చే సంవత్సరం మార్చి వరకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇంకా సమయం ఉండడం వల్ల నిర్ధేశించిన గడువు వరకు లబ్ధిదారులకు యూనిట్లను అంద జేస్తాం.

**రీ సైక్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ?**

గొర్రెలను లబ్ధిదారులకు అందించడంలో పక్కా నిబంధనలను అమలు చేస్తున్నాం. మండలస్థాయి అధికారుల సమక్షంలోనే కొనుగోలు చేసి అందజేస్తున్నాం. కొన్ని సంఘటనల వల్ల ఈ ఆరోపణలు పుడుతున్నాయి. జిల్లాలో ఎక్కడ అక్రమాలకు తావు లేకుండా పంపిణి చేస్తున్నాం.

**జిల్లాలో పశువైద్యుల కొరత ఉంది కదా ?**

గతంలోనే ప్రభుత్వానికి ఖాళీలపై నివేదిక అందజేశాం. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ ద్వారా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే అందులోంచి మెదక్ జిల్లాకు 20 మంది పశువైద్యాధికారులను నియమించనుంది. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులుభర్తీ అవుతాయి.

**జిల్లాలో వెటర్నరీ మొబైల్ వాహనాలు ఎన్ని ఉన్నాయి ?**

జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు రెండు వెటర్నరీ మొబైల్ వాహనాలు మంజూరయ్యాయి. త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఈ వాహనాలు పశువులకు వైద్యం అందించనున్నాయి.



సిద్దిపేటలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం

# ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు.. ..కార్మికులు చిత్తు

● అందని కనీస వేతనాలు
● సతమతమవుతున్న కార్మికులు

**సిద్ది పేట టౌన్ :** కనీస వేతనాలు లేకపోవడంతో విద్యుత్ శాఖలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కార్మికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనేక సార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ వారిని పట్టించుకోవడం లేదు. 24 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో వారు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేశారు. కానీ ట్రాన్స్‌పార్మర్లను మరమ్మతు చేస్తున్నా కార్మికులను మాత్రం పట్టించుకోకపోవడంతో వారు ఇటీవలే సమ్మెకు దిగారు. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన సమ్మె 22 వరకు సాగింది.

## సిద్దిపేట జిల్లాలో ఆరు మరమ్మతు షెడ్లు

జిల్లాలో 6 విద్యుత్ మరమ్మతు షెడ్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 16 ఉండేవి. సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, బెజ్జంకి, తొక్కాపూర్, ముస్త్యాలా, ముస్తాబాద్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు సెంటర్లున్నాయి. ఈ 6 షెడ్లలో సుమారు 70 మంది విద్యుత్ మరమ్మతు కార్మికులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం సూపర్‌వైజర్‌కు రూ.8000 చెల్లిస్తున్నారు. ఎల్‌వీ వైండింగ్ చేసే కార్మికులుకు, హెవీ వైండింగ్ చేసే వారికి రూ.7500, అసెంబ్లింగ్ కార్మికులకు రూ.6500, ట్యాగింగ్ చేసే కార్మికులకు రూ.5000, హెల్పర్లకు రూ.4500 చెల్లిస్తున్నారు. గతంలో వీరికి రూ.5000 మాత్రమే చెల్లించేవారు. దీంతో కార్మికులు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు.

### డిమాండ్లు

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలను కల్పించాలి
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- కాంట్రాక్ట్ పద్ధతిని వెంటనే తొలగించాలి
- పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలి
- క్యాజువల్ లీవులను ఇవ్వాలి
- సమ్మె కాలంలో జీతాన్ని చెల్లించాలి



### రెండు నెలల్లో సమస్యను పరిష్కరించాలి

రెండు నెలల్లో సమస్యను పరిష్కరించకపోతే మళ్లీ సమ్మెకు దిగుతాం. సీఎండీ ప్రభాకర్ సారు సమ్మె విరమించాలని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సారు చెప్పిన ప్రకారం సమ్మెను విరమించాం. పరిష్కరించకపోతే మళ్లీ సైరన్ మోగిస్తాం.

**- వెంకన్న,**
**ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**



### పిల్లలను పెంచడం కష్టంగా ఉంది.



చాలీచాలని వేతనాలతో మా పిల్లలను పోషించుకోవడం కష్టంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మా సమస్యలపై దృష్టి సారించాలి. ఆపరేటర్లను రెగ్యులర్ చేసినట్లుగానే మమ్మల్ని రెగ్యులర్ చేయాలి. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తాం.

**- నిరుడి ఎల్లం, అసెంబ్లర్**

### ఉద్యోగ భద్రత కల్పించాలి



ఉద్యోగ భద్రత కల్పించాలి. వేతనాలను వెంటనే పెంచాలి. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించి మా కుటుంబాలను ఆదుకోవాలి. చాలీచాలనీ వేతనాలతో ఇళ్లు గడవడం లేదు. సీఎం కేసీఆర్ సారు మా భాదలను పట్టించుకోవాలి.

**- విఠల్, వైండింగ్ కార్మికుడు**

### 24 ఏళ్లుగా పనిచేస్తున్నాను



24 ఏళ్లుగా పనిచేస్తున్నాను. మమ్మల్ని వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించకపోవడం దారుణం.

**- రాజు, ట్యాగింగ్ కార్మికుడు**

# సెర్ప్‌లో హెచ్‌ఆర్ పాలసీని వర్తింపజేయాలి

● మండల సమాఖ్య అకౌంటెంట్ ఆపరేటర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్

ఉద్యోగపర్వం



**మెదక్ అర్బన్:** ఉద్యోగ భద్రత కోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ఫ్) మండల సమాఖ్యలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనం రూ.18 వేలు చెల్లించి అందరికీ ఉద్యోగ భద్రతను కల్పించాలి. మండల సమాఖ్యలోనే పనిచేస్తున్న ఏపీఎంలు, సీసీలకు సెర్ఫ్ ద్వారా వేతనాలు అందుతుండగా, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, అటెండర్లకు మాత్రం మండల సమాఖ్య నుంచి జీతాలను చెల్లిస్తున్నారన్నారు. 12 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం. సెర్ఫ్‌లో హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలి. ఆరోగ్య భద్రత, బీమా కల్పించడంతో పాటు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి. మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేయాలి. క్యాడర్ ఫిక్స్ చేసి జాబ్‌చార్ట్‌ను ఏర్పాటు చేసి పని ఒత్తిడిని తగ్గించాలి. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

# అమ్మ వారికి కుంకుమార్చనతో సౌభాగ్యం

● చిట్కుల్ చాముండేశ్వరీ ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర్‌శర్మ

భక్తి





**చిలప్‌చెడ్:** మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ దగ్గర మంజీర నది సమీపంలో వెలిసిన చాముండేశ్వరీ అమ్మవారి ఆలయం దక్షిణ భారతదేశంలోనే రెండో అతిపెద్ద దేవాలయంగా పేరుగాంచింది. ఈ ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేయడం వల్ల ఆ కుటుంబానికి ఏ కష్టం లేకుండా సుఖసంతోషాలతో ఉంటుందన్న విశ్వాసం. అందువల్ల ఈ ఆలయం ప్రత్యేకంగా కుంకుమార్చనలకు ప్రతీకగా నిలిస్తోంది. శుక్రవారం, సెలవు రోజైన ఆదివారం ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. ముఖ్యంగా శ్రావణమాసంలో ఈ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి కుంకుమార్చన చేస్తుంటారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి భక్తులు ఇక్కడకు విచ్చేస్తుంటారు. ఈ ఆలయంలో కుంకుమార్చనతో పాటు అమ్మవారికి ఓడిబియ్యం పోయడం వల్ల సిరిసంపదలు కల్గుతాయని భక్తుల నమ్మకం.

## పెళ్లయినా వ్యక్తితో యువతి ప్రేమాయణం

## పంచాయతీకి భయపడి ఉరేసుకున్న యువకుడు



పవార్‌నారాయణ మృతదేహం

**మనూరు/నాగల్‌గిద్ద:** ప్రియుడికి ఇంకొకరితో పెళ్లయినా తననే పెళ్లి చేసుకోవాలని ఓ యువతి పోలీసులను ఆశ్రయించింది. యువతి బంధువులు ప్రియుడిపై బెదిరింపులకు పాల్పడడంతో భయపడి ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖేడ్ సీఐ సైదా, ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగల్‌గిద్ద మండలం ఔదత్‌పూర్ గ్రామానికి చెందిన పవర్ నారాయణకు (24) సంవత్సరం క్రితం పెళ్లి జరిగింది. నారాయణకు అదే గ్రామానికి చెందిన యువతితో మూడు సంవత్సరాలుగా ప్రేమ వ్యవహారం నడుస్తున్నది. తనను కాదని వేరే పెళ్లి చేసుకున్నాడని ఆ యువతి తనకు న్యాయం చేయాలని మంగళవారం నాగల్‌గిద్ద పోలీసులను ఆశ్రయించింది. దీంతో నారాయణను పోలీసులు పిలిచి విచారణ జరిపి గ్రామ పెద్దలతో మాట్లాడుకొండని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఇద్దరికి నచ్చ జెప్పి పంపించారు. బుధవారం గ్రామంలో పంచాయతీ ఏర్పాటు చేస్తే తనను అవమానపరుస్తారని, యువతి బంధువులు బెదిరిస్తారని భయపడిన నారాయణ గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి సోనాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

## విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి



జోగేందర్ ప్రసాద్ మృతదేహం

**జిన్నారం:** విద్యుదాఘాతంతో ఓ కాంట్రాక్టు కార్మికుడు మరణించిన ఘటన గడ్డపోతారంలో జరిగింది. బుధవారం గడ్డపోతారం అరబిందో పరిశ్రమ వద్ద ప్యాబ్రి కేషన్ పనులు నిర్వహిస్తూ విద్యుత్ షాక్ తగిలి జోగేందర్ ప్రసాద్(44) అనే కార్మికుడు గాయ పడ్డాడు. పరిశ్రమకు ఎదురుగా ఉన్న ఈటీపీ షెడ్డులో ప్యాబ్రికేషన్ పనులు జరుగుతుండగా జోగేందర్ ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే చికిత్స కోసం తరలించగా మరణించాడు. మృతుడు బీహార్ వాసి కాగా, కొంతకాలంగా రంగారెడ్డి జిల్లా దుండిగల్ తండాలో ఉంటున్నాడు. ప్రమాదంపై బొల్లారం పోలీసులు కేసు నమోదు చేశారు.

## దొంగతనం కేసులో వ్యక్తి రిమాండ్

• ఐదు తులాలు బంగారం, రూ.ఐదు వేలు స్వాధీనం



నిందితుడిని చూపుతున్న పుల్కల్ ఎస్ఐ సత్యనారాయణ

**పుల్‌కల్:** మండలంలోని రాయిపాహడ్ గ్రామంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు పుల్కల్ ఎస్ఐ బి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగతనానికి సంబంధించిన వివరాలను వివరించారు. గ్రామానికి చెందిన మేతరి లక్ష్మయ్య ఇంట్లో ఈ నెల 24వ తేదీన దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఇల్టం గంగాధర్ మేతరి లక్ష్మయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి ఐదు తులాల బంగారం రూ.ఐదు వేలను ఎత్తుకెళ్లాడని ఎస్ఐ తెలిపారు. బుధవారం రాయిపాహడ్ గ్రామంలోని ప్రధాన రహదారిపై గంగాధర్ అనుమానస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. లక్ష్మయ్య ఇంట్లో చోరీకి గురైన ఐదు తులాల బంగారం, రూ.ఐదు వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నేరస్తుడు గంగాధర్‌ను జోగిపేట మున్సిఫ్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## 'అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలి'

**సదాశివపేట:** పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ.మాణిక్యం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి వి.ప్రవీణ్‌కుమార్, నాయకులు చంద్రయ్య, భూషణం, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పాఠశాల భవనం

• ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి • భయాందోళనలో విద్యార్థులు



పెచ్చులూడిన పాఠశాల పై కప్పు, గోడకు ఏర్పడ్డ పగుళ్లు, వరండాలో భయంతో పాఠాలు వింటున్న విద్యార్థులు

**హత్నూర:** మండల పరిధిలోని నాగారం గ్రామ పంచాయతి కోడిప్యాక గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆ పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు మొత్తం 55 మంది విద్యార్థులుండగా, ఒక్క ఉపాధ్యాయురాలు ఉన్నారు. అయితే పాఠశాల భవనం కొన్నేళ్ల క్రితం నిర్మించింది కావడంతో పూర్తి శిథిలావస్థకు చేరింది. అంతే కాకుండా ఇటీవల కురిసిన వర్షానికి భవనం పైకప్పు పెచ్చులూడి పడి ఇనుప చువ్వలు తేలాయి. ఇక గోడలు ఎక్కడికక్కడ పగుళ్లు వచ్చి భయంకరంగా కనిపిస్తున్నాయి. భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు వరండాలో కూర్చొని పాఠాలు వింటున్నారు. అంతే కాకుండా ఆ పాఠశాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారు. పాఠశాల దుస్థితిపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా లెక్క చేయడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం

ఈ విషయమై మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతి సంప్రదించగా కోడిప్యాక పాఠశాల విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయామని నూతన భవనం మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

## ఆంధ్ర ఉద్యోగులను తరలించండి

• ట్రాన్స్‌కోలో ఉద్యోగుల నిరాహారదీక్షలు



ట్రాన్స్‌కో కార్యాలయంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఉద్యోగులు

**సంగారెడ్డి రూరల్:** సీమాంధ్ర ఉద్యోగుల కుట్రలకు నిరసనగా విద్యుత్ సంస్థలోని తెలంగాణ స్థానిక ఉద్యోగులు సంగారెడ్డిలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో బుధవారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల వివిధ అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు, రామేశ్వరస్వామి, చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగులపై పెత్తనం చెలాయిస్తూ అనేక రకాలుగా కుట్రలు పన్నుతున్న ఆంధ్ర ఉద్యోగుల వైఖరికి నిరసనగా తాము దీక్షలు చేపట్టామని అన్నారు. ఉద్యోగుల విభజన త్వరగా పూర్తి చేయాలని, ఏ రాష్ట్రానికి చెందిన ఉద్యోగులను ఆ రాష్ట్రాలకు పంపించాలని, కోర్టు కేసులు వేస్తూ పదోన్నతులను అడ్డుకునేవారు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రా ఉద్యోగులను వారి ప్రాంతాలకు పంపేవరకు తమ రిలే నిరహారదీక్షలు విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.చంద్రశేఖర్, సంతోష్‌కుమార్, ప్రశాంత్, శ్రీదేవి, బి.సంతోష్‌కుమార్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, ప్యానల్ కమిటీల ఎన్నిక



మాట్లాడుతున్న పట్నం విజయలక్ష్మి

**సదాశివపేట:** సదాశివపేట మున్సిపల్ కాంట్రాక్ట్, ప్యానల్ కమిటీలను చైర్‌పర్సన్ పట్నం విజయలక్ష్మి అధ్యక్షతన ఎన్నుకున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో 5వ వార్డు కౌన్సిలర్ చింతాగోపాల్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కమిటీ సభ్యులుగా వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం, కౌన్సిలర్లు ఎస్.ఖలీంపాటిల్, ఉల్లిగడ్డల ఛాయా, ఎం.డి.వాజీద్, ఖుద్దుస్, ఎన్.జయరాంగౌడ్, ఎన్.శివలక్ష్మి పేర్లను ప్రతిపాదించగా 18వ వార్డు కౌన్సిలర్ ఓదెల మాణిక్‌రావు బలపర్చాడు. ఏ విధమైన పోటీ లేకపోవండతో కాంట్రాక్ట్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అనంతరం ప్యానల్ కమిటీ సభ్యులుగా కౌన్సిలర్లు చింతా గోపాల్, బి.మేఘన, ఎన్.శ్రీనివాస్, టి.అనురాధ, ఎ.అనంతమ్మ, జె.భిక్షపతి, ఓదెల మాణిక్‌రావును ఎన్నుకున్నారు.

## 'కార్మికుల సమస్యలపై సీఎం స్పందించాలి'

**సంగారెడ్డి రూరల్:** కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం విమర్శించారు. సంగారెడ్డిలోని కేకే భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్ట్ పరిశ్రమల్లో 65 సంస్థల్లో 52 రంగాల జీవోల కాలపరిమితి ముగిసి 8 ఏళ్లు పూర్తయినా వాటిని ఇంత వరకు సవరించలేదని విమర్శించారు.

## కార్మికుల వేతనాలు చెల్లించండి

• ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా

**సంగారెడ్డి రూరల్:** సంగారెడ్డిలోని కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే.రాజయ్య డిమాండ్ చేశారు. స్థానిక కేంద్ర ప్రభుత్వాసుపత్రి ఎదుట బుధవారం సీఐటీయూ అద్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ కార్మికులకు 4 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పండిందన్నారు. కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు యాదవరెడ్డి, మహబూబ్, నాగరాజు, శోభ, రాజు పాల్గొన్నారు.



**పాఠకులకు సూచన:**

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు.
ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
**బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.**
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్



బాధిత రైతులకు నచ్చజెబుతున్న తహసీల్దార్ గోవర్ధన్

### రోడ్డు విస్తరణ

# సర్వేను అడ్డుకున్న రైతులు

- రోడ్డు మ్యాప్ మారిందని ఆందోళన
- నచ్చజెప్పిన తహసీల్దార్ గోవర్ధన్

**కంది:** రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన సర్వేను మామిడిపల్లి రైతులు అడ్డుకున్నారు. రోడ్డు మ్యాప్ మారిందని ఆందోళనకు దిగారు. 65వ జాతీయ రహదారి నుంచి మామిడిపల్లి మీదుగా జిల్లాలో సుమారు 60గ్రామాలను అనుకుని నాందేడ్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి నేషనల్ హైవే ఆధారిటీ వారు నిర్ణయించారు. 200 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టగా, అందుకు అనుగుణంగా అధికారులు బుధవారం మామిడిపల్లి రోడ్డుకు ఇరువైపుల సర్వే చేపట్టారు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు అక్కడకు చేరుకుని సర్వేను అడ్డుకున్నారు. రోడ్డు వెడల్పు విషయంలో ముందు ఇచ్చిన మ్యాప్‌కు తగ్గట్టుగా కాకుండా మార్చి సర్వే చేయడం ఏమిటని ప్రశ్నించారు. ముందు సూచించిన మ్యాప్ ప్రకారం సర్వే చేయాలని డిమాండ్ చేశారు. చుట్టూరా ఉన్న రియల్ వ్యాపారుల (వెంచర్ల)ను కాదని తమ పంట పొలాల్లో నుంచి రోడ్డు వేస్తామంటే ఊరుకునేది లేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. విషయం తహసీల్దార్ గోవర్ధన్ దృష్టికి వెళ్లడంతో ఆయన సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజేప్పే ప్రయత్నం చేశారు. సర్వే పూర్తి చేస్తేనే రికార్డు ప్రకారం పరిహారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అంతే తప్ప మొదటి దశలో ఉన్న సర్వే పనులను అడ్డుకుంటే పరిహారం రాదన్నారు. మ్యాప్ మారిన విషయాన్ని తహసీల్దార్‌కు రైతులు వివరించగా, నేషనల్ హైవే ఆధారిటీ వారు ఎగ్జిస్టింగ్ ఆలైన్ ప్రకారం రోడ్డు విస్తరణ జరుగుతుందని తహసీల్దార్ వివరించారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి మిటింగ్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను రైతులు కోరారు.

### రోడ్డు మ్యాప్‌ను మార్చకండి

రహదారి విస్తరణ కోసం చేపట్టే రోడ్డు మ్యాప్‌ను ఎట్టిపరిస్థితుల్లో మార్చవద్దంటూ బాధిత రైతులు మొరపెట్టుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న వెంచర్లను వదిలేసి సాగు చేసుకుంటున్న భూముల్లోంచి రోడ్డు వేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. ఇప్పటికే ఐఐటీ కారణంగా భూములు కొల్పోయామని, మళ్లీ ఇప్పుడు రోడ్డు విస్తరణ అంటూ రైతుల నోట్లో మట్టికొట్టొద్దని వేడుకున్నారు. భూములు కొల్పోయి జీవనాధారం లేకుండా ఎట్లా బతికేదన్నారు. రోడ్డు మ్యాప్ మార్పు విషయమై అవసరమైతే కోర్టుకైనా వెళతామని బాధిత రైతులు తెలిపారు.

## ఉమ్మడి మెదక్ జిల్లాలో 50 మంది వీఆర్వోలకు పదోన్నతలు

### జారీ కాని బదిలీ ఉత్తర్వులు

**తూప్రాన్:** ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేస్తున్న 50మంది గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తు ఆదేశాలు జారీ అయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 24మందికి, మెదక్ జిల్లాలో 12మందికి, సిద్దిపేట జిల్లాలో 14మందికి పదోన్నతులు లభించాయి. మెదక్ జిల్లాకు చెందిన నర్సింహారావు(కొంగోడు), నర్సింగ్(చండి), ప్రవీణ్‌కుమార్ (అల్లాపూర్), గంగాధర్(గవ్వలపల్లి), నాగరాజు(రావెల్లి), హన్మంతరెడ్డి (అక్కన్నపేట), నాగేశ్(బ్రాహ్మణపల్లి), రుక్మొద్దీన్(ఘనపూర్), భూపతిరావు (బండపోసాన్‌పల్లి), మధుకుమార్(మాసాయిపేట), ప్రభాకర్ (ఆవంచ), బీ మల్లారెడ్డి(టి.మందాపూర్)కు పదోన్నతి లభించింది.

# బీసీ వసతి గృహాలకు మెరుగులు

- కలెక్టర్ చొరవతో అభివృద్ధి
- రూ. 83.65 లక్షలతో మరమ్మతులు, మౌలిక వసతులు



తొగర్‌పల్లి బీసీ వసతిగృహంలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)



దౌల్తాబాద్ బీసీ వసతిగృహ ఆవరణలో గుబురుగా పెరిగిన మొక్కలు

**సంగారెడ్డి టౌన్:** జిల్లాలోని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న వసతిగృహాలు కొత్త హంగులతో మెరుగులు దిద్దుకుంటున్నాయి. బీసీ వసతిగృహాలకు సున్నం, శానిటేషన్, నీటి సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్ ప్రత్యేక చొరవ తీసుకొని రూ. 83.65 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులతో జిల్లాలోని బీసీ వసతిగృహాల రూపురేఖలు మారిపోయాయి. జిల్లాలో మొత్తం 22 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉండగా 18 హాస్టళ్లు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. 4 అద్దె భవనాల్లో ఉన్నాయి. వీటిలో 11 వసతిగృహాల్లో బాలురు, 5 వసతి గృహాల్లో బాలికలకు వసతి కల్పిస్తున్నారు. కాగా మరో 11 పోస్టు మెట్రిక్ వసతిగృహాలుండగా వీటిలో ఆరు బాలికలకు, ఐదు బాలురకు కేటాయించారు. ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో 1,863 మంది విద్యార్థులు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 1050 మంది విద్యార్థులు ఉన్నారు.

### మెరుగులు దిద్దుకున్న వసతిగృహాలు

కలెక్టర్ చొరవ తీసుకొని సీబీఎఫ్ (క్రూసియెల్ బ్యాలెన్స్ ఫండ్) ద్వారా బీసీ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం గత మేలో రూ. 83.65 లక్షలు విడుదల చేశారు. గత మార్చిలో నిర్వహించిన హాస్టల్ నిద్రలో భాగంగా అధికారులంతా హాస్టళ్లలో నిద్ర చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, హాస్టళ్ల స్థితిగతులపై నివేదికలు తయారు చేశారు. దశాబ్దాల కింద నిర్మించిన బీసీ వసతి గృహాలన్ని మరమ్మత్తులకు నోచుకోకుండా, సున్నం లేకుండా, శిథిలావస్థకు చేరుకున్నాయని గుర్తించారు. విద్యార్థులకు తాగునీటి సమస్య, మరుగుదొడ్లు తదితర సమస్యలను గుర్తించి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ రూ.83.65 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులతో అన్ని వసతి గృహాలకు వైట్‌వాష్ (సున్నం) రంగులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతులను కల్పించారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### బీసీ వసతి గృహాల్లో డిజిటల్ తరగతులు

జిల్లాలోని అన్ని బీసీ వసతి గృహాల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ సూచన మేరకు బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆశన్న చొరవతో గత రెండు నెలల క్రితం డిజిటల్ తరగతులను ప్రారంభించారు. డిజిటల్ తరగతుల వల్ల విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు మెరుగై సత్ఫలితాలిస్తున్నాయి. డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించారు. జిల్లాలోని 22 ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు.

### హరితహారంతో పచ్చదనం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం కింద జిల్లాలోని బీసీ వసతిగృహాల ప్రాంగణాల్లో గత సంవత్సరం నాటిన మొక్కలు గుబురుగా పెరుగుతూ పచ్చదనాన్ని తలపిస్తున్నాయి. జిల్లాలోని 22 ప్రీమెట్రిక్ వసతిగృహాల ఆవరణల్లో 3700 మొక్కలు నాటగా 3200 మొక్కలు బతికాయని సంక్షేమ శాఖ అధికారి ఆశన్న తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత, నిర్వాహణను విద్యార్థులు, వాచ్‌మెన్‌లకు అప్పగించామన్నారు. ఫలితంగా నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోస్తూ, సంరక్షించారని తెలిపారు. ఈ సారి మరో 1030 మొక్కలు నాటామన్నారు.

# సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్





సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్, సంగారెడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీఎన్‌జీవోస్ నేతలు

**సంగారెడ్డి అర్బన్:** సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి ఐబీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ సీపీఎస్ విధానం న్యూపెన్షన్ స్కీం విధానంగా కాకుండా నో పెన్షన్ స్కీంగా పరిగణించాలని ఎద్దేవా చేశారు. 2004 సెప్టెంబర్ 1 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న 1,25,618మంది ఉద్యోగులకు పెన్షన్ నిరాకరించడంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగి వాటాగా 10శాతం, ప్రభుత్వ వాటాగా 10శాతం మొత్తంగా 20శాతం ఏ నిధిలో జమ అవుతుందో తెలియని పరిస్థితిలో సీపీఎస్ ఉద్యోగులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 2వేల మంది సీపీఎస్ ఉద్యోగులు రిటైర్డ్ కాగా 222మంది ఉద్యోగులు చనిపోయారన్నారు. వారికి ఇప్పటి వరకు పెన్షన్ గానీ, గ్రాడ్యూటీ గానీ ఏ విధమైన సౌకర్యం కల్పించలేదన్నారు. సీపీఎస్ విధానం రద్దు ద్వారానే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని టీఎన్జీవోస్ సంఘం భావించి ముఖ్యమంత్రికి ఈ విషయాన్ని విన్నవించినట్లు పేర్కొన్నారు. 13 సంవత్సరాల నుంచి టీఎన్ జీవోస్ ఆధ్వర్యంలో 19 సార్లు సామూహిక సెలవులు పెట్టి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లాస్థాయి, డివిజన్, మండలస్థాయిలలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. టీఎన్‌జీవోస్ తరపున కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీ రవి, టీఎన్‌జీవోస్ బాధ్యులు సుశీల్‌బాబు, ఎం నర్సింలు, జావేద్‌అలీ, భూపాల్‌రెడ్డి, ఎం.జగన్, పర్వతాలు, వైద్యనాథ్, శివప్రసాద్, గౌసోద్దీన్, నాగరాజు, వీరయ్య, జనార్దన్, రవికుమార్, ఆంజనేయులు, దేవీదాస్ తదితరులు పాల్గొన్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న గొర్రెలు, పొట్టేళ్లు

# కొండెక్కిన గొర్రెలు, పొట్టేళ్ల ధరలు

### బక్రీద్ సమీపిస్తుండడంతోనే...

**నారాయణఖేడ్:** బక్రీద్ పర్వదినం సమీపిస్తుండడంతో గొర్రెలు, పొట్టేళ్ల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. బక్రీద్ సందర్భంగా గొర్రెలు, పొట్టేళ్లను కొనుగోలు చేయడానికి ముస్లింలు ఆసక్తి చూపుతారు. సెప్టెంబర్ 2న పండుగ ఉండడంతో గొర్రెలు, పొట్టేళ్లకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుత ధరలను చూసి ప్రజలు జంకుతున్నారు. మార్కెట్‌లో రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నట్లు పలువురు తెలిపారు. వారం రోజుల క్రితం పది కిలో పొట్టేల రూ. 4 వేల నుంచి 5వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ. 7వేల నుంచి 8వేల వరకు విక్రయిస్తున్నారు. 15నుంచి 20కిలోల వరకు పొట్టెలును రూ. 9 వేల నుంచి 10 వేల వరకు విక్రయించే వారని ప్రస్తుతం రూ. 13వేల నుంచి 15 వేల వరకు పలుకుతోందన్నారు. దీంతో ముస్లింలు ఆందోళన చెందుతున్నారు. పండుగకు తప్పని సరిగ్గా మాంసం అవసరం కావడంతో ఎంత డబ్బు కర్చు అవుతుందోనని అంచనా వేసుకుంటున్నారు. మరికొందరు పండుగ ఎలా జరుపుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

### డిమాండ్ పెరగడం వల్లే..

గొర్రెలు, పొట్టేళ్లకు మార్కెట్‌లో డిమాండ్ పెరగడం వల్లే ధరలు పెరిగాయి. గతంలో ఇంత ధర లేదు. బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఎక్కువగా గొర్రెలు, పొట్టేళ్లను కొనుగోలు చేస్తున్నారు.

**- రాంగొండ, గొర్రెల పెంపకం దారుడు**

### ధరలు పెరిగినా గొర్రెలు దొరకడం లేదు

గొర్రెలు, పొట్టేళ ధర పెరిగానా మార్కెట్‌లో జీవాలు లభించడం లేదు. గత వారంలో రూ. 8 వేలకు లభించే పొట్టేలు పండుగ సందర్భంగా బుధవారం రూ. 13 వేలకు కొనుగోలు చేశా.

**- అశ్వాక్ అలీ, ముస్లిం**

# మాంసం దిగుబడులను పెంచుతాం



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

- **70 కోట్ల చేప పిల్లలను వదులుతాం**
- **పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

**పుల్‌కల్:** కుల వృత్తుల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం కృషి చేస్తోందని పశు, మత్స్య సంపద, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. పుల్‌కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టులో బుధవారం ఉచిత చేప పిల్లల వదిలే కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం నీటి పారుదల శాఖ అతిథి గృహంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులకు మెదడు లేదని, అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్ నుంచి వెళ్లరని, కాంగ్రెసోళ్లే జారకుండా బట్టి విక్రమార్క కాపాడుకోవాలని హితవు పలికారు. గతంలో మత్స్యకారులు, గొల్లకుర్మలను ఓటర్లుగా చూశారే తప్ప ఏనాడు కూడా వారి బాగోగులను పట్టించుకోలేదన్నారు. కుల వృత్తులను సర్వనాశనం చేసింది గత పాలకులేనని దుయ్యబట్టారు. టీఆర్‌ఎస్ అధికారంలో వచ్చాకనే కుల వృత్తులకు మేలు జరుగుతుందన్నారు. అట్టడుగు వర్గాల సంక్షేమాన్ని కాంక్షించిన సీఎం కేసీఆర్ బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించారన్నారు. రోజు రోజుకు మాంసం వినియోగం పెరిగిపోయిందని, మాంసం దిగుబడులను పెంచి ఎగుమతి చేస్తామని మంత్రి వెల్లడించారు. అన్నిరకాల జల వనరుల్లో విస్తృతంగా చేపలు పెంచి మార్కె టింగ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. మత్స్యకారుల సంఖ్య అధికంగా ఉండడంతో ఈసారి 70కోట్ల చేప పిల్లను వదలనున్నట్టు తెలిపారు. కుల వృత్తులు ఆర్థి కంగా బలపడిన ప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్య మన్నారు. చేప పిల్లల సైజు విషయంలో రాజీ పడటంలేదని, నాణ్యత, లెక్కా పక్కాగా ఉంటుందన్నారు. మొబైల్ స్టాళ్ల రాయితీపై ఇస్తామన్నారు. మత్స్యకారులు మురుగు కాల్వల వెంట దుకాణాలు ఏర్పాటు చేయవద్దని మొబైల్ స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రూ.20వేల విలువైన స్టాల్‌ను కేవలం రూ.5వేలకే ఇస్తామన్నారు. 75శాతం సబ్సిడీపై రవాణా వాహనాలను సమకూరుస్తున్నట్టు మంత్రి చెప్పారు. చేపలెక్కడ దొరుకుతాయంటే ఆంధ్రాలో అనేవారని, ఇక నుంచి తెలంగాణలో అనే పేరు తీసుకురావాలని సూచించారు. సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ దిశగా ముందు కెళ్తున్నారని, మనమంతా ఆయనకు బాసటగా నిలబడదామ న్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణను మాంసం హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు తలసాని వెల్లడించారు. కేజీ కల్చర్‌ను 20శాతం సబ్సిడీని అందజేస్తున్నామని, కేజీ కల్చర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు సొసైటీలు ముందుకురావాలని మంత్రి సూచించారు.

అనంతరం అందోలు ఎమ్మెల్యే బాబూ మోహన్ మాట్లాడుతూ జోగిపేటకు ఫిష్ మార్కె ట్‌ను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. సింగూరు ప్రాజెక్టు చాలా పెద్దదని, ఇందులో కొర మీను చేప పిల్లలు లేవని, వాటిని వదిలే అంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే కోరారు. మంత్రి స్పందిస్తూ రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది తప్పకుండా కొరమీను పిల్లలను వదులుదామన్నారు. ఈ సందర్భంగా పలువురు గొర్రె కాపరులకు మంత్రి గొర్రెలను పంపిణీ చేయగా, కాపరులు గొంగడి కప్పి గొర్రెపిల్లను బహూకరించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ రాష్ట్ర కమిష నర్ సువర్ణ, జేసీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఫిషరీస్ జేడీ రాథోడ్, ఏడీ సుజాత, మత్స్య సహకార సంఘం ఛైర్మన్ నర్సింలు, గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి, జోగిపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ డీబీ నాగభూషణం, సీడీసీ డైరెక్టర్ జైపాల్‌నాయక్, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీనివాస్ గౌడ్, రత్నమ్మ, తహసీల్దార్ సమ్మయ్య, టీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్‌ముదిరాజ్, కనకారెడ్డి, ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, టీఆర్‌ఎస్ యువత అధ్యక్ష, కార్యదర్శులు కిషన్‌గౌడ్, అలీం, నాయకులు మహేశ్‌ముదిరాజ్, గోపాల్, మాణిక్యరెడ్డి, శ్రీహరి, దర్శన్‌రెడ్డి, జనార్ధన్, సదానందారెడ్డి, మిర్యాల విఠల్, దేవుని గోపాల్, శ్రీశైలం, అశోక్ పాల్గొన్నారు.

# వాణిజ్య పంటలు @ జహీరాబాద్

- **డివిజన్‌లో అధికంగా ఎర్రనేలలు**
- **వాణిజ్య పంటలకు అనుకూలం**
- **అధికంగా అల్లం, పసుపుతోపాటు పండ్ల తోటల పెంపకం**
- **అన్నీ అనుకూలిస్తే రైతుకు భారీ లాభాలు**

**జహీరాబాద్:** వాణిజ్య పంటలకు జహీరాబాద్ ఖిల్లా. మట్టి నుంచి బంగారాన్ని తీయొచ్చనే నానుడికి ఈ ప్రాంతం ప్రతిరూపంగా మారింది. భూములు, ప్రకృతి అనుకూలించడంతో పలు రకాల పండ్లతోటలతో పాటు ఇతర వాణిజ్య పంటలను ఇక్కడి రైతులు సాగుతున్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోని రైతాంగం అల్లం, వెల్లుల్లి, పసుపు, చెరకు, బంగాళదుంప తదితర పంటలను సాగు చేస్తూ, లాభాలను గడిస్తున్నారు.

జహీరాబాద్, కోహీర్ ప్రాంతాల్లోని భూములు ఎక్కువగా ఎర్రనేలలు. ఇవి అల్లం, పసుపు పంటలకు అనుకూలమని రైతాంగం భావిస్తోంది. ఎర్రనేలలే కాకుండా ఇసుక, గరుకు, నల్లరేగడి, చౌడు భూములు కూడా ఇక్కడ ఉన్నాయి. ఎర్ర నేలల్లో నీటిపారుదల సౌకర్యం ఉంటే అన్ని రకాల పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి. డివిజన్ పరిధిలో అధికశాతం బోర్లు, బావులపై ఆధారపడే వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. మిగతా భూములకు నీటి సౌకర్యం లేకపోవడంతో వర్షాధారంగా ఖరీఫ్, రబీ సీజన్ల వారిగా పంటలను పండిస్తున్నారు. వర్షాధార పంటల్లో కూడా వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. పత్తి, వాము, మిరప తదితర పంటలు వేస్తున్నారు. చిరుధాన్యాల పంటలతో లాభాలు అంతంత మాత్రమే వస్తుండడంతో పెద్ద మొత్తంలో వాణిజ్య పంటల సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ పంటలే కాకుండా నీటి తడులు ఉన్న రైతులు అరటి, మామిడి, జామ, సపోట, బత్తాయి, బొప్పాయి తదితర పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుతో కొందరు రైతులు ఆర్థికంగా బాగానే సంపాదిస్తున్నారు. సీజన్ల వారీగా ఇక్కడ పండించే పండ్లను ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తూ పలువురు రైతులు లాభాలను అర్జిస్తున్నారు.

### భారీగా వాణిజ్య పంటల సాగు

వాణిజ్య పంటలైన అల్లం, అరటి, బొప్పాయి, బంగాళదుంప(ఆలుగడ్డ), చెరకు పంటలతో పాటు వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జహీరాబాద్ డివిజన్‌లో కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్, మొగుడంపల్లి తదితర ప్రాంతాల్లో రైతులు చిరుధాన్యాలతో పాటు నీటి లభ్యత ఆధారంగా వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. ఇటీవల వర్షాలు ఏకధాటిగా కురియడంతో పంటలను పలువురు నష్టపోతున్నారు. మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధరలు లభించక తరుచుగా నష్టాలను చవిచూస్తున్నారు. వాణిజ్య పంటలకు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తున్నది. పంటలు పండించిన మీదట రైతులకు అన్ని కూలిస్తే.. భారీగా లాభాలను పొందుతారు.



జహీరాబాద్‌లో సాగు చేసిన బొప్పాయి పంట

**జహీరాబాద్ డివిజన్‌లోని సాగువుతున్న వాణిజ్య పంటల వివరాలు**

| మండలం | సాగు విస్తీర్ణం (హెక్టార్లలో) | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | అల్లం | పసుపు | మిరప | అరటి | సీతాఫలం | ద్రాక్ష | జామ | మామిడి | బొప్పాయి | దానిమ్మ | సపోటా | నిమ్మ | బత్తాయి |
| జహీరాబాద్ | 780 | 152 | 27 | 287 | 34 | 31 | 62 | 652 | 226 | 27 | 34 | 11 | 81 |
| కోహీర్ | 850 | 28 | 12 | 295 | 18 | 15 | 251 | 1170 | 221 | 62 | 121 | 12 | 62 |
| ఝరాసంగం | 192 | 80 | 22 | 44 | 25 | - | 15 | 340 | 32 | 14 | 14 | - | - |
| న్యాల్‌కల్ | 163 | 93 | 10 | 31 | 15 | 5 | 9 | 272 | 54 | 48 | 19 | - | 15 |



మంత్రి తలసానికి గొంగడి కప్పి గొర్రెను బహూకరిస్తున్న గొల్లకుర్మలు



చేపల బుట్టను పరిశీలిస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే బాబూమోహన్

# పేదల అభ్యున్నతే కేసీఆర్ లక్ష్యం

- **అభివృద్ధి, సంక్షేమం దేశంలోనే ఆదర్శం**
- **త్వరలో మత్స్య సహకార సంఘాలకు కొత్త కమిటీలు**
- **పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జడ్పీ ఛైర్‌పర్సన్ రాజమణి, ఎమ్మెల్యే ప్రభాకర్

**సంగారెడ్డి టౌన్:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం కేసీఆర్ లక్ష్యమని పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మేలు చేసిన పాపాన పోలేదని ఆయన ఆరోపించారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. గొర్రెల పంపిణీతో గొల్ల, కుర్మ, యాదవ కుటుంబాల్లో, చేపల పెంపకంతో గంగపుత్ర, ముదిరాజు, తెనుగు కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నట్టు చెప్పారు. మత్స్యసహకార సంఘాలను బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గంగపుత్రులు, ముదిరాజు, తెనుగు వర్గాల్లో ప్రతి ఒక్కరికీ సహకార సంఘంలో సభ్యత్వమివ్వడమే ప్రధాన లక్ష్యమన్నారు. మత్స్యకారులను ప్రోత్సహించేందుకు, వారి ఆర్థికాభివృద్ధికి రాష్ట్రంలోని 77 జలాశయాలు, 4,347 మత్స్యశాఖ చెరువుల్లో గతేడాది 27కోట్ల చేపపిల్లలను పెంచినట్టు చెప్పారు. ఈ సారి సింగూరులో 3.60కోట్ల చేప పిల్లల పెంపకానికి శ్రీకారం చుట్టామన్నారు. సమైక్య పాలనలో చేపల పెంపకానికి ఏడాదికి బడ్జెట్‌లో రూ.5కోట్లు మాత్రమే కేటాయించేదన్నారు. రూ.5వేల కోట్లతో చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం కింద మొదటి దశలో ఇప్పటివరకు 15,35,709 గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు మంత్రి వివరించారు. గొర్రెలతోపాటు పశువులకు వైద్య చికిత్సలు అందించేందుకు వంద మొబైల్ వాహనాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు. వాటిని త్వరలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందజేస్తామన్నారు. సంగారెడ్డిలో రూ.50లక్షలు, సదాశివపేటలో రూ.25లక్షలతో చేపల మార్కెట్లను ఏర్పాటు చేయనున్నట్టు తలసాని చెప్పారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ రాజమణి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మత్స్యసహకార సంఘాల కమిషనర్ సువర్ణ, జేసీ వెంకటేశ్వర్లు, టీఆర్‌ఎస్ నాయకులు చిల్వేరి ప్రభాకర్, ఆర్.వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, హరికిషన్, బొంగులరవి, బాబా, పెరుమాళ్ల నర్సింలు, లియాకత్‌అలీ పాల్గొన్నారు.

## సినిమాలు

**పటాన్‌చెరు**
ఎస్‌ఎస్‌వీ — జయ జానకి నాయక
రుక్మిణి — అర్జున్‌రెడ్డి

**రామచంద్రాపురం**
సంగీత — జయ జానకి నాయక
జ్యోతి — ఫిదా

**సదాశివపేట**
జ్యోతి — లై
మహేశ్వరి — అర్జున్‌రెడ్డి

**బొల్లారం**
జ్యోతి — అర్జున్‌రెడ్డి

**సంగారెడ్డి**
నటరాజ్ — జయ జానకి నాయక
రుక్మిణి — నేనేరాజు నేనే మంత్రి
సితార — అర్జున్‌రెడ్డి

**జోగిపేట**
శ్రీవెంకటేశ్వర — లై

# గొర్రె యూనిట్ల పంపిణీతో మెరుగైన ఉపాధి

**• కులాల వారిగా ప్రభుత్వ సహాయం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు:** సామాజిక వర్గాల వారిగా వారికి నైపుణ్యం ఉన్న కులవృత్తులను ప్రోత్సహించి తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచలనే లక్ష్యంతో టీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు రూపకల్పణ చేస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరులో గొర్లయూనిట్లను యాదవ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్లపెంపకం యూనిట్లను పంపిణీ చేయడం ద్వారా నియోజకవర్గంలో వేలాది మంది యాదవులకు ఉపాధి మెరుగైందన్నారు. విద్యావంతులైన యువత ముందుకు వచ్చి వారి వ్యాపార నైపుణ్యం, తెలివితేటలతో యూనిట్లను అభివృద్ధి పరిచి పదిమందికి ఉపాధి కలగజేసే అవకాశం ఉంటుందన్నారు. కార్పొరేటర్ శంకర్‌యాదవ్ మాట్లాడుతూ గొర్లయూనిట్లలో పుట్టిన గొర్లకు ప్రభుత్వమే మంచి మార్కెట్ సదుపాయం కల్పించాలన్నారు. గొర్ల మేతకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. పట్టణంలో మొత్తం 37గొర్ల యూనిట్లను లబ్ధిదారులకు అందజేశారు. 46లక్షల విలువైన గొర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుష్పనగేష్‌యాదవ్, ఆత్మకమిటీ చైర్మన్ గడీల కుమార్‌గౌడ్, ఎంపీపీ శ్రీశైలంయాదవ్, నాయకులు మల్లేష్‌యాదవ్, రాజుయాదవ్, వెంకటేశ్‌యాదవ్, దేవయ్యయాదవ్, నర్సింలుయాదవ్, యాదగిరియాదవ్, వెటర్నరీ అధికారులు శేఖర్, బుచ్చయ్య, విజయకమారి పాల్గొన్నారు.

### మైనార్టీల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

ముస్లింల సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బాకత్‌గల్లీలో మైనార్టీ అషుర్‌ఖానా (పీరీల మసీదు)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు సైతం చేపట్టని సంక్షేమ పథకాలను మైనార్టీల కోసం కొనసాగిస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. సుమారు పదిలక్షల నిధులతో పురాతన అషుర్‌ఖానాను పునరుద్ధరించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్‌యాదవ్, ఎంపీపీ శ్రీశైలంయాదవ్, నాయకులు లియాకత్‌అలీ, ఇక్బాల్, ముక్బాల్, అఫ్జల్ పాల్గొన్నారు.

### 3996 డబుల్ బెడ్ రూం ఇళ్లు

**రామచంద్రాపురం:** మండల పరిధిలోని కొల్లూరు, ఈదులనాగులపల్లి గ్రామాల్లో 3996 మంది పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కొల్లూరు, ఈదులనాగులపల్లి గ్రామాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల కోసం గుర్తించిన స్థలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొల్లూరు గ్రామంలోని ప్రభుత్వ సర్వే నంబరు 191లో 2052, ఈదులనాగులపల్లి సర్వే నంబరు 135లో 1944 ఇళ్లను నిర్మించనున్నామని చెప్పారు. కొల్లూరులో కేబీఆర్ ఇన్‌ఫ్రా, ఈదులనాగులపల్లిలో హయగ్రీవ నిర్మాణ సంస్థలు డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చాయన్నారు. డబుల ఇళ్ల నిర్మాణంలో స్థానికులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీపీ యాదగిరియాదవ్, జడ్పీటీసీ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గొర్లయూనిట్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## బూత్ స్థాయిలో పార్టీ పటిష్టతకు కార్యాచరణ

**• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్‌రెడ్డి**



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

**పటాన్‌చెరు:** బీజేపీని బూత్ స్థాయిలో పటిష్టపరిచేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండల అధ్యక్షుడు ప్రభాకర్‌గుప్త అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభంజనం వీస్తోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణాలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం టీఆర్ఎస్ ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి కేంద్ర పథకాల గూర్చి చెప్పాలన్నారు. ప్రభాకర్‌గుప్త మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల పరిధిలో 59పోలింగ్ బూత్‌ల్లో అన్ని విభాగాల కమిటీల నియామకం పూర్తి జరిగిందన్నారు. మిగతావి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

## స్టోన్‌క్రషర్ల నిర్లక్ష్యంతో పెరుగుతున్న ప్రమాదాలు



బీటీ రహదారిపై పేరుకున్న మట్టిని చూపుతున్న యువకులు

**జిన్నారం:** మాధారంలో నూతనంగా వేసిన బీటీ రహదారిపై స్టోన్ క్రషన్ టిప్పర్ల తీరుతో కంకర, మట్టి పేరుకొని ప్రమాదాలు జరుగుతున్నాయని యువజన సంఘాల సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం నియోజకవర్గ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు విజయ్‌గౌడ్, విద్యార్థి నాయకులు సన్ని, విజయ్, కుమార్, ప్రవీణ్, నరేశ్, శ్రీకాంత్ స్టోన్ క్రషర్ల తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రెండు వరుసల బీటీ రహదారిని ఏర్పాటు చేయగా స్థానిక క్రషర్ల వాహనాలు అధిక లోడుతో ప్రయాణం చేస్తున్నాయని, దీంతో రహదారి మొత్తం కంకర, మట్టితో కప్పి ప్రయాణికులకు ప్రమాదాలు కల్గిస్తుందన్నారు. ఈ విషయమై క్రషర్ యజమానులకు తెలియజేసినా స్పందన లేదని, క్రషర్ వాహనాలను నియంత్రించాలంటూ ఆందోళన జరిపారు.

## 'పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలి'

**పటాన్‌చెరు:** కొత్తగా ప్రవేశపెట్టిన కంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం ఎత్తివేసి పాత పద్దతిలోనే కొనసాగించాలని కోరుతూ పలు ఉద్యోగ సంఘాల నాయకులు బుధవారం పటాన్‌చెరు ఎంపీడీవో అనంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల లక్షలాది మంది ఉద్యోగులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విధానాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 1వ తేదీన ఉద్యోగులంతా సామూహిక సెలవును ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు శ్రీనివాస్‌రావు, శ్రీధర్, శ్రీకాంత్, సంజయ్‌కుమార్, హరిశంకర్‌గౌడ్, మహేష్, కిషోర్, రిజ్వాన్, మధుమోహన్, రవి పాల్గొన్నారు.

## రేపు ధర్నా, ర్యాలిని విజయవంతం చేయాలి

**• టీసీపీఎస్ఈఏ సంఘాల నాయకులు**

**సంగారెడ్డి రూరల్:** పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీ, ధర్నాలో ఉపాధ్యాయ, ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీసీపీఎస్ఈఏ సంఘాల నాయకులు టి.లక్ష్మారెడ్డి, అశోక్‌కుమార్, సంజీవయ్య, సంగమేశ్వర్, సాయిలు, మల్లేశం, శ్రీనివాస్ కోరారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఓపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున శుక్రవారం ఉదయం 10 గంటల వరకు సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలోకి చేరుకోవాలని వారు కోరారు.

# కళాశాల వసతి గృహానికి తాళం

**• పోలీసుల దర్యాప్తు ముమ్మరం • వారం రోజుల సెలవులతో ఇంటిబాట పట్టిన విద్యార్థులు**



వసతి గృహానికి తాళం వేసి ఉన్న దృశ్యం,గోడలపై రాతలను పరిశీలిస్తున్న క్లూస్‌టీం (ఫైల్‌ఫొటో)

**హత్నూర:** తుర్కలఖానాపూర్ శివారులోగల రత్నపురి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని సహస్ర ఆత్మహత్య ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కళాశాల విద్యార్థులు, సిబ్బందితో వేర్వేరుగా మాట్లాడటంతో పాటు క్లూస్ టీంను రప్పించి గోడలపై ఉన్న రాతలను క్షుణ్ణంగా పరిశీలించి పలు వివరాలు సేకరించారు. సహస్ర మృతితో తోటి విద్యార్థులు వసతి గృహంలో ఉండటానికి జంకుతున్నారు. నిత్యం విద్యార్థుల తల్లిదండ్రుల రాకపోకలు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో చేసేదేమి లేక కళాశాల యాజమాన్యం వసతి గృహంలోని బాలికలకు సుమారు వారం రోజుల పాటు సెలవు ప్రకటించి వసతి గృహానికి తాళం వేసి ఉంచారు. సహస్ర మృతి స్థానిక విద్యార్థుల్లో అలజడి రేపింది.

## చదువులో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

**• టీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**గుమ్మడిదల:** విద్యార్థులు పాఠాలు శ్రద్ధగా విని అందివస్తున్న సౌకర్యాలను సద్వినియోగ పరుచుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని టీఆర్ఎస్ జిల్లా నాయకుడు, సీజీఆర్ ట్రస్టు అధినేత చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అనంతారం గ్రామ ఉపసర్పంచ్ చిమ్ముల నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు కార్యకర్తల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఉప సర్పంచ్ తల్లిదండ్రులైన ఎంపీటీసీ చిమ్ముల లలితా, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు చిమ్ముల నర్సింహారెడ్డి, అన్న గోవర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పలువురు కేక్ తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుమ్మడిదల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీజీఆర్ ట్రస్టు సౌజన్యంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ ఐడీ కార్డు, బెల్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నజియా, గుమ్మడిదల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తులసీదాస్, సర్పంచ్, ఉపసర్పంచ్ కొమ్ము క్రిష్టయ్య, చిమ్ముల నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల బాల్‌రెడ్డి, ఎస్ఎంస్ చైర్మన్ మందబాస్కర్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, సూర్యనారయణ, సుధాకర్‌రెడ్డి, యాదిరెడ్డి, గోపాల్, స్టార్ సంజీవరెడ్డి, మండల యువత విభాగం ఉపాధ్యక్షుడు పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, చిమ్ముల ప్రజ్వల్‌రెడ్డి, సీహెచ్ రాజేందర్‌రెడ్డి, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఐడీకార్డ్సు, బెల్టులను అందజేస్తున్న గోవర్ధన్‌రెడ్డి

## బొల్లారంలో రుబెల్లా టీకాలు

**జిన్నారం:** బొల్లారం ప్రభుత్వ పాఠశాలలో రుబెల్లా, మీజిల్స్ టీకాలను వేశారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ చిరాగ్, స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు శివానీ, 560 మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు.

## 'నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ తరగతులు'

**రామచంద్రాపురం:** పట్టణంలోని నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) సర్కిల్-22 డిప్యూటీ కమిషనర్ బోజ్యరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు కొనసాగే శిక్షణ తరగతులను మాదాపూర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్, ఐటీఐ విద్యార్థులకు ప్రొడక్షన్, మిషన్ ఆపరేటర్, పదో తరగతి విద్యార్థులకు సోలర్‌ప్యానెల్, ఇన్‌స్టాలేషన్ టెక్నీషన్, నర్సింగ్ ఆడ్స్, ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్, 8వ తరగతి విద్యార్థులకు ఎలక్ట్రిషన్ డొమెస్టిక్‌లో శిక్షణ అందిస్తామన్నారు. అవసరమైన విద్యార్థులకు హాస్టల్ వసతి, ఉచిత బస్‌పాసులు అందిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## ఓఆర్ఆర్ వద్ద నేడు బీజేపీ ధర్నా

**రామచంద్రాపురం:** గ్రామాల్లోని రహదారులను పూర్తి చేయాలన్న డిమాండ్‌తో గురువారం వెలిమెల అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా నాయకుడు మల్లెపల్లి రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కె.సత్యానారాయణ, కె.నర్సింగ్‌రావు, గాలిగిరి, నరేందర్‌రెడ్డి రహదారుల అసంపూర్తి పనులపై సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 'సహస్ర మృతి కారకుల పై చర్యలు తీసుకోండి'

**సంగారెడ్డి రూరల్:** రత్నపురి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థిని సహస్ర మృతికి కారణమైన అధికారులు, తోటి స్నేహితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాబురావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# 'సేవా కార్యక్రమాలు అభినందనీయం'





పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్ జయమ్మ, జిన్నారంలో అన్నదానం నిర్వహిస్తున్న హన్మంతరెడ్డి, నిమజ్జనం సందర్భంగా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

**రామచంద్రాపురం:** యువత సేవా కార్యాక్రమాలతో పాటు వినాయక నవరాత్రి ఉత్సవాల వంటి భక్తి కార్యాక్రమాలు చేపట్టడం అభినందనీయమని రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షురాలు ముత్యాల జయమ్మ అన్నారు. సేవా యూత్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో బండలగూడలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ ఖలీదాబేగం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా యువకులు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం శుభపరిణామన్నారు.

## వినాయక మండపాల వద్ద అన్నదానం

**జిన్నారం:** మండలంలోని గడ్డపోతారం, బొల్లారంలో గణపతి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం బొల్లారంలో గణపతి మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి పాల్గొన్నారు. గడ్డపోతారం, కిష్టాయ్యపల్లిలో ఎంపీటీసీ బసెట్టిగారి రాజు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిన్నారం, బొల్లారంలో పలుచోట్ల వినాయకులను ఘనంగా నిమజ్జనం చేశారు.

## 'పారా మెడికల్' వినాయక నిమజ్జనం

**సంగారెడ్డి అర్బన్:** పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్అంబేద్కర్ వొకేషనల్ అండ్ పారా మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ కరస్పాండెంట్ భార్గవి ధారాసింగ్ వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన రహదారి గుండా కళాశాల విద్యార్థుల డ్యాన్స్‌లతో మహబూబ్‌సాగర్ వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి అక్కడే చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ భార్గవి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాల గణనాథుల నిమజ్జనం

**సంగారెడ్డి రూరల్:** వినాయక వారోత్సవాల్లో భాగంగా ఐదు రోజుల వరకు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ నెల 29న రాత్రి సంగారెడ్డిలోని వినాయక్‌సాగర్‌లో గణనాథులను భక్తులు నిమజ్జనం చేశారు. పట్టణంలోని శివాజీనగర్, పోతిరెడ్డిపల్లిలోని వినాయకులను ట్రాలీ ఆటోల్లో భజనలు చేసుకుంటూ, యువత నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా బయలుదేరి వినాయక్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఈ మంగళవారం రాత్రి సుమారు 20కి పైగా బాల వినాయకులను నిమజ్జనం చేశారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక్‌సాగర్ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## నేడు 'తారా'లో వర్క్‌షాప్

**సంగారెడ్డి అర్బన్:** పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 31న వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.రాజేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల సెమినార్ హాల్‌లో మున్సిపల్ కౌన్సిలర్లు, ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతాప్రభాకర్, జేసీ వాసం వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ పార్థసారథి హాజరవుతారని పేర్కొన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ శంకర్‌కుమార్ అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో సుపరిపాలన, నాయకత్వపు లక్ష్యణాలు, పట్టణీకరణ సమస్యలు, సవాళ్లు, కౌన్సిలర్ల బాధ్యత, స్వచ్ఛభారత్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు.

## '3న కార్మికుల మహాసభలు'

**సంగారెడ్డి రూరల్:** మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా ప్రథమ మహాసభలను సెప్టెంబర్ 3వ తేది నుంచి నారాయణ్‌ఖేడ్‌లో నిర్వహిస్తున్నట్టు యూనియన్ నాయకురాలు గంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

**సంగారెడ్డి రూరల్:** సంగారెడ్డిలోని ఇందిరా కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో వెంకటనర్సింలు గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు రిజిస్టర్, వివిధ రికార్డులను, మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ అబ్దుల్ అఖిల్ ఖాద్రి పాల్గొన్నారు.

## రోడ్డును బాగు చేయాలని ఆందోళన

**సదాశివపేట రూరల్:** పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీకి వెళ్లే రోడ్డుపై మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ న్విహించారు. అనంతరం కమిషనర్ ఇసాఖ్‌అబ్‌ఖాన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

# పేద కుటుంబాలను ఆదుకుంటున్న ప్రభుత్వం

**• అందోల్ ఎమ్మెల్యే బాబూమోహన్**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూమోహన్

**వట్‌పల్లి:** తెలంగాణలో నిరుపేద కుటుంబాలను ఆదుకోనేందుకే కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆందోల్ ఎమ్మెల్యే బాబూమోహన్ తెలిపారు. వట్‌పల్లిలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో బుధవారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు మేనమామ కట్నం కింద 75,00,100 రూపాయలను కేసీఆర్ కృషితో చెల్లిస్తున్నామన్నారు. రేగోడ్33, వట్‌పల్లి 16, అల్లాదుర్గం 13 , టేక్మాల్ 32 కలిపి మొత్తం 94 మంది లబ్ధిదారులకు 57లక్షల 96వేల 747 రూపాయలు పంపిణీ చేశామన్నారు. అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించనున్న తాగునీటి ట్యాంకులను రూ.కోటి ముప్పైలక్షల నిధులు మంజూరుతో పాటు ట్యాంకులను శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు కమ్రోద్దీన్, రాయికోడ్ ఏసయ్య, జోగిపేట నాగభూషణం, తహసీల్దార్ జె.స్వామి, నయిమోద్దీన్, రాణప్రతాప్‌సింగ్, నాగేశ్వరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ అశోక్‌గౌడ్, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరారెడ్డి, శ్రీనివాస్‌రావు, ఎంపీటీలు శివాజీరావు, బస్వరాజు, విఠల్, నాయకులు బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కుతుబోద్దీన్ పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దుకై 1న కలెక్టరేట్ వద్ద ధర్మదీక్ష

**• సీపీఎస్‌ను అంతం చేసేంత వరకు ఉద్యమం : ఉపాధ్యాయ సంఘాల నాయకులు**




మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

**సంగారెడ్డి అర్బన్:** నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న ఉద్యోగ ఉపాధ్యాయులు సామూహిక సెలవులు పెట్టి కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే శాంతి ర్యాలీ, ధర్మదీక్ష కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్బంగా టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాలస్వామి, టీఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాణయ్య, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న సంగారెడ్డిలోని ఐబీ నుంచి ఉదయం 10గంటలకు కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఆ తర్వాత సాయంత్రం 5గంటల వరకు ధర్మదీక్ష పేరిట కలెక్టరేట్ వద్ద ధర్నా కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూమి శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ, గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## వర్షానికి కుప్ప కూలిన మాజీ కౌన్సిలర్ ఇల్లు



కూలిన మాజీ కౌన్సిలర్ రాయిపాడ్ రమేశ్ ఇల్లు

**సదాశివపేట:** నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పట్టణంలోని 22వ వార్డులో గల మాజీ కౌన్సిలర్ రాయిపాడ్ రమేశ్‌కు చెందిన ఇల్లు బుధవారం వెకువజామున కుప్పకూలిపోయింది. ఆ సమయంలో ఇంటి యజమానురాలు లక్ష్మమ్మ, ఆమె కుమారుడు గిరీశ్ ఇంట్లో ఓ మూలన ఉన్న చిన్నపాటి గదిలో ఉండడంతో ప్రమాదం తప్పింది. ఇల్లు నేలమట్టం కావడంతో ప్రస్తుతం లక్ష్మమ్మ పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం తమను అదుకోవాలని ఆమె వేడుకుంటుంది.

## పదోన్నతులపై 'రెవెన్యూ' సంఘం హర్షం

**• జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు**

**సంగారెడ్డి రూరల్:** రెవెన్యూ శాఖలో వివిధ క్యాడర్లలో ఏర్పడ్డ ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేసినందుకు రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కలెక్టర్ మాణిక్యరాజ్ కన్నన్‌కు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపింది. ఇప్పటి వరకు 50 మంది గ్రామ రెవెన్యూ అధికారులను సీనియర్ సహాయకులుగా, 35 మంది టైపిస్టు, జూనియర్ సహాయకులను సీనియర్ పహాలయకులుగా, 59 మంది సీనియర్ సహాయకులను గిర్దావర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి నాయబ్ (డిప్యూటీ) తహసీల్దార్లుగా పదోన్నతులు ఇచ్చినందుకు రెవెన్యూ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, మనోహార్ చక్రవర్తి, అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాములు ధన్యవాదాలు తెలిపారు. శివప్రసాద్ మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంత పెద్ద సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ఘనత కలెక్టర్ మాణిక్యరాజ్ కన్నన్‌కే దక్కుతుందన్నారు.

## పయనీర్స్‌లో మాన్‌సూన్‌మస్తీ



మాన్‌సూన్‌మస్తీ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల చిన్నారులు

**సంగారెడ్డి అర్బన్:** పట్టణంలోని పయనీర్స్ పాఠశాలలో బుధవారం మాన్‌సూన్‌మస్తీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు చిన్న పిల్లలతో కలిసి ఎంతో ఆనందోత్సవాలతో ఈ మన్‌సూన్‌మస్తీ జరుపుకున్నారు. పాఠశాల ఫ్రీప్రైమరీ విద్యార్థులకు వర్షాకాలంపై అవగాహన కల్పించడానికి చిరు ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఆడుతూ 'సెర్ప్' ఉద్యోగుల నిరసన

**సంగారెడ్డి రూరల్:** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) మండల స్థాయి ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకుంది. వారి సమ్మెను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఉద్యోగులు రోడ్డుపై బతుకమ్మ ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఉద్యోగుల సమ్మెకు స్త్రీనిధి ఆర్ఎం అనంతకిషోర్, బీఎంజీఎస్ నర్సప్ప, పోచయ్య, బాల్‌రాజ్, నాగరాజ్, లింగమూర్తి, ఏపీఎంలు నర్సింలు, శ్రీనివాస్ హాజరై మద్దతు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత, నాయకులు పద్మ, శోభన్, మహేష్, జైభీం, నాగమణి, సుజాత, కల్పన పాల్గొన్నారు.

## 'రైతులకు పంట రుణాలివ్వాలి'

**సంగారెడ్డి రూరల్:** రైతులకు పంట రుణాలు బ్యాంకుల ద్వారా ఇప్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో వ్యవసాయ శాఖాధికారి శైలజకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా రైతులకు ఇంతవరకు రుణాలు ఇవ్వలేదని, జిల్లా అధికారులు పెట్టుకున్న లక్ష్యంలో 50శాతం కూడా దాటలేదని విమర్శించారు.

**నారాయణఖేడ్ సినిమాలు**

| | |
|---|---|
| షెట్కార్‌సువర్ణ | వివేకం |
| వెంకటేశ్వర | నేనే రాజు.. నేనే మంత్రి |
| **పెద్దశంకరంపేట** | |
| లక్ష్మి | జయ జానకి నాయక |

## ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూవో శశికళ

**నారాయణఖేడ్:** ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని అయినప్పటికీ తాము పని చేసిన ప్రాంతాల్లో అందించిన సేవలు మాత్రం తీపి గుర్తులుగా ఉంటాయని నారాయణఖేడ్‌లో ఆరు సంవత్సరాలుగా ఏఎస్‌డబ్ల్యూవోగా విధులు నిర్వహించి బదిలీ అయిన శశికళ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొదట్లో నారాయణఖేడ్ రావడానికి తాను భయపడ్డానని వచ్చాక మాత్రం చాలా ఆనందంగా విధులు నిర్వహించామన్నారు. ఆరు సంవత్సరాలుగా తనకు అందరు సహకరించడంతోనే చక్కగా సేవలు అందించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు చంద శ్రీనివాస్, సంక్షేమాధికారులు సంతోశ్, బద్దిరాజు, రామప్ప, రాజిరెడ్డి, రాజ్‌కమల్, రవితేజ, నర్సింలు, రవి ఉన్నారు.

## నల్లవాగు ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

**కల్హేర్:** జిల్లాలోని ఏకైక మధ్యతరహ ప్రాజెక్టు అయిన నల్లవాగుకు బుధవారం ఇన్‌ఫ్లో తగ్గినట్లు ప్రాజెక్టు ఏఈ సూర్యకాంత్ తెలిపాడు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 1493.05 అడుగులుగా ఉంది. పూర్తి నీటి మట్టం 1493 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 140 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అదే స్థాయిలో అలుగుపై నుంచి 50 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 90 క్యూసెక్కల నీరు దిగువకు వెళ్తున్నట్లు ఏఈ తెలిపారు.

## మాసాన్‌పల్లిలో గణేశ్ లడ్డూను రూ.30,100 దక్కించుకున్న గ్రామస్థుడు

**కల్హేర్:** మండల పరిధిలోని మాసాన్‌పల్లిలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద మంగళవారం రాత్రి జరిగిన వినాయకుడి లడ్డూ వేలంపాటలో రూ.30,100కు గ్రామానికి చెందిన మలిపెద్ది వెంకటేశం దక్కించుకున్నాడు. ప్రతి సంవత్సరం ఈ వినాయకుడి దగ్గర వినాయకుడి చేతిలో పెట్టిన లడ్డూను వేలం వేస్తారు. ఈ సారి అత్యధికంగా వేలం పాట పాడన వెంకటేశం వినాయకుడి లడ్డును కైవసం చేసుకున్నారు.

## 'నూతన జిల్లాల ప్రకారం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలి'

**కంగ్టి:** త్వరలో జరుగబోయే ఉపాధ్యాయ నియామకాలను నూతన జిల్లాల ప్రకారం జరుపాలని కోరుతూ బుధవారం మండల కేంద్రమైన కంగ్టిలో డీఎస్సీ అభ్యర్థులు, విద్యావలంటీర్లు తహసీల్దార్ రాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాలను కలుపుకుని నియామకాలు చేపడితే స్థానికేతరులు నియామకమై తర్వాత జరిగే బదిలీల్లో వారి ప్రాంతాలకు వెళ్లి పోతుండడంతో విద్యాభివృద్ధిలో వెనుకబడిన కంగ్టి లాంటి ప్రాంతాలకు ఆటంకం కలుగుతుందన్నారు. కావున కొత్త జిల్లాల ప్రకారమే నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మఠం, శివానందస్వామి, కాశీనాథ్, సూర్యకాంత్, తుకారం, జీవన్, రాజు, లక్ష్మన్, ప్రకాశ్, అనీల్, గుండప్ప, పాల్గొన్నారు.

## 'డిజిటల్ విధానంపై అవగాహన కల్పించాలి'

**నారాయణఖేడ్:** డిజిటల్ విధానంపై మీసేవా కేంద్రాల నిర్వహకులు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మేనేజర్ శివప్రసాద్ అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లో మీసేవా కేంద్రాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా పీఎంజీవై, టీవ్యాలేట్ కార్యక్రమాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్నారని, ప్రభుత్వం కూడా డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నందున కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు పండరిరెడ్డి, యూసుఫ్, కృష్ణ, కైసర్, సంతోశ్, దత్తు ఉన్నారు

# తెల్లబంగారానికి ఎర్రనల్లి తెగుళ్లు



ఏపుగా పెరిగిన పత్తి పంట

**సిర్గాపూర్:** మండలంలో రైతులు పత్తిపంట (తెల్లబంగారం) వైపు ఎక్కువ మొగ్గు చూపి పంటను అధికంగా సాగు చేసుకున్నారు. ఇతర పంటల కంటే పత్తికి మార్కెట్‌లో రేటు ఉండి అమ్మగానే డబ్బులు చేతికి అందుతాయనే ఆశతో మండలంలో 959 హెక్టార్ విస్తీర్ణంలో పంటను సాగు చేశారు. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో పంట ఏపుగా పెరిగి పూత కాయ దశకు వచ్చింది. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పత్తి పంటకు ఎర్ర నల్లి సోకి పత్తి ఎర్రబడుతుంది. దీంతో ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఎవరికి తోచినట్టు వారు మందులను వాడుతున్నారు. బాగా పెరిగిన పంట ఎక్కడ నశించి పోతుం దేమోనని ఆందోళనతో ఎరువుల దుకాణంలో ఏ మందు ఇస్తే ఆ మందులను తెచ్చి పిచికారి చేస్తూ వేలకు వేలు ఖర్చు పెడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### మోతాదులతో మందులు వాడాలి



ఎర్రనల్లి సోకిన పత్తి పంట నివారణకు డైక్లోపాల్ 5 మి.లీ వెటోవిల్ సల్ఫర్ 39 ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలి. మెగ్నిషియం లోపంతో ఆకులు ఎర్రబడి రాలు తాయి. దీని నివారణకు మెగ్నిషియంసల్ఫేట్ 4.10 గ్రాములో, ఒక లీటరు నీటిని వాడాలి. దీని నివారణకు తరువాత (మోనోక్రోటోపాస్ 1.6 మి.మీ ఒక లీటరు నీటిని కలిపి పిచికారి చేయవచ్చు.

**- శశాంక్, వ్యవసాయాధికారి**

# గణనాథుడికి ఊరూరా ఘనపూజలు

● **ఆసక్తితో పూజలు చేస్తున్న భక్తులు**

**నారాయణఖేడ్:** వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా ఇప్పటి వరకు పట్టణాల్లోనే పోటాపోటీగా మండపాలను ఏర్పాటు చేసే వారు. ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో సైతం యువకులు వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవడానికి పట్టణాలకు దీటుగా మండపాలను ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ మండలం నిజాంపేటలో గరీబ్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఆకట్టుకునే విధంగా మండపాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మండల పరిధిలోని నమ్లిమేట్‌లో సింహగర్జన యూత్ ఆధ్వర్యంలోనూ ఆకట్టుకునే విధంగా మండపాన్ని ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోను భక్తులు మండపాల్లో పూజలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నిజాంపేటలో 31న గరీబ్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.



నారాయణఖేడ్ మండలం నమ్లిమేట్‌లో సింహగర్జన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం



నిజాంపేటలో ప్రతిష్ఠించిన భారీ వినాయకుడి విగ్రహం

# అవసరాలకు అనుగుణంగా విద్యను అందించాలి

● **సరస్వతీ విద్యాపీఠం దక్షిణ మధ్యక్షేత్ర సేవా ప్రముఖ్ కుందూరు విద్వాన్‌రెడ్డి**

**నారాయణఖేడ్:** మారుతున్న అవసరలకనుగుణంగా విద్యను అందించేందుకు సరస్వతీ శిశుమందిరాల ద్వారా కృషి చేస్తున్నామని సరస్వతి విద్యాపీఠం దక్షిణ మధ్యక్షేత్ర సేవా ప్రముఖ్ కుందూరు విద్వాన్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విద్యాభివృద్ధి ఒకే విధానంతో ఉండాలనే ఆలోచనతో గోరక్‌పూర్ కేంద్రంగా విద్యాభారతీ సంస్థ ఆవిర్భవించిందన్నారు. ఆ సంస్థకు అనుబంధంగా 1967లో మాతృభాషలో విద్యాభివృద్ధిని సాధించి విద్యార్థుల్లో దేశభక్తి, సంస్కారాన్ని పెంపొందింప చేయాలనే ఆలోచనతో నిర్మల్‌లో మొట్టమొదట సరస్వతి శిశుమందిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం రెండు రాష్ట్రాల్లో 320 శిశుమందిరాలను ఏర్పాటు చేసి 29 వేల మంది పిల్లలకు విద్యా బోధన అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం విద్యావిధానంలో మార్పు వచ్చిందని అందుకు అనుగుణంగా శిశుమందిరాలను కూడా ఆంగ్ల మాధ్యమంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోషకుల మీద ఆధారపడి ఈ పాఠశాలలు పని చేస్తున్నాయని అందువల్ల ఈ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రబంధకారిని, అధ్యక్షుడు మునిగాల మాణిక్‌ప్రభు, కార్యదర్శి డాక్టర్ శివకుమార్, సమితి అధ్యక్షుడు దొండిరావు, బీఎంఎస్ రాష్ట్ర నాయకులు రాఘవులు, విద్యాపీఠ ప్రతినిధి జ్ఞానేశ్వర్, ప్రబంధకారిని బాధ్యులు త్యార్లవీరయ్య, వీరేశం, క్రిష్ణమూర్తి, మధుసూదన్‌రెడ్డి, ప్రధానాచార్యులు సంజీవరెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు ఆయన పాఠశాల ఆచార్యులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు.

## పుల్‌కూర్తి ప్రభుత్వ పాఠశాలలో దొడ్డు బియ్యంతో అన్నం

● **నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు**

**మనూరు:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం పెట్టాలన్న ఉద్దేశంతో సన్న బియ్యం అన్నం పెడుతున్న విషయం విధితమే. అందుకు విరుద్ధంగా దొడ్డు బియ్యంతో వండిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసన తెలిపిన సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం పుల్‌కూర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. తమ పిల్లలకు దొడ్డు బియ్యంతో చేసిన అన్నం పెడుతున్నట్లు విలేకరులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు విలేకరులు పాఠశాలను విజిట్ చేసి మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు. అన్నం దొడ్డుగా ఉంది. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం గోవింద్ నాయక్‌ను ప్రశ్నించగా



విలేకరులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

తమ పాఠశాలకు వచ్చిన బియ్యాన్ని వడ్డిస్తున్నామని సన్నబియ్యం అయిన అన్నం మాత్రం దొడ్డుగా ఉడుకుతుందన్నారు. 7వ తరగతి విద్యార్థులు సోని, ధనలక్ష్మి, హీన, నిర్మల, మాట్లాడుతూ దొడ్డు బియ్యంతో అన్నం చేస్తున్నారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి విద్యార్థులకు అందించే మధ్యాహ్నం బోజనం సక్రమంగా అందే విధంగా చూడాలన్నారు.

## ఎన్పీఆర్డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బస్వరాజ్ పాటిల్



బస్వరాజ్

**కంగ్టి:** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) రాష్ట్ర ఉపాధ్యక్షుగాగా బస్వరాజ్ పాటిల్, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రుస్తుం జలీల్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు నర్సింలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్‌ఆర్ గార్డెన్‌లో జరిగిన ఎన్పీఆర్డి ద్వితీయ మహాసభల్లో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

**జహీరాబాద్ సినిమాలు**

| | |
|---|---|
| మోహన్ | ఫిదా |
| సినీమ్యాక్స్ | వివేకం |
| అనురాగ్ | జయ జానకి నాయక |




కలెక్టర్‌చే ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆయిదాల సునీల్

## కలెక్టర్‌చే సునీల్‌కు ప్రశంసాపత్రం

**జహీరాబాద్:** జహీరాబాద్ మండలం రాయిపల్లి(డి) గ్రామానికి చెందిన తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారుడు, స్వేరోజ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయిదాల సునీల్ బుధవారం ప్రపంచ జాపపద దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆడిటోరియంలో ప్రదర్శించిన కళాప్రదర్శనలో ఉత్తమ ప్రతిభకనబర్చినందుకు జిల్లా కలెక్టర్ మాణిక్యరాజ్‌కన్నన్ ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ కలెక్టర్‌చే ప్రశంసాపత్రం అందుకోవడం తనకేంత సంతోషకరంగా ఉందన్నారు.

## సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల ఆందోళన

**జహీరాబాద్:** జహీరాబాద్ పట్టణంలోని ఉర్దూమీడియం డిగ్రీ కళాశాలలో సౌకర్యాలలేమి మూలంగా ఇబ్బందులకు గురవుతున్నామంటూ బుధవారం కళాశాల విద్యార్థులు రహదారిపై రాస్తారోకో, ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా కళాశాల నుంచి రహదారి వరకు ర్యాలీ నిర్వహించి రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో విషయాలను బోధించేందుకు అధ్యాపకులు లేకపోవడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పలుమార్లు అధికారులకు, నాయకులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్ అందజేత

**కోహీర్:** సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే సమ్మెలో పాల్గొనడం జరుగుతుందని మండల పంచాయతీ కార్యదర్శులు బుధవారం మండల ప్రజా పరిషత్ సూపరింటెండెంట్ పాండయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేంత వరకు ఉద్యమిస్తామన్నారు. సీపీఎస్ విధానం ఉండడంతో ఉద్యోగస్థులు భవిష్యత్‌లో నష్టపోతారన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అంజయ్య, పంచాయతీ కార్యదర్శులు అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఖదీర్, స్వరూప, జ్యోస్న్న, చారి, ఖదీర్, పరమేశ్వర్ ఉన్నారు.

## 'వీఆర్‌ఏలను వ్యవసాయ శాఖలో విలీనం చేయరాదు'

**జహీరాబాద్‌టౌన్:** వీఆర్‌ఏలను వ్యవసాయ శాఖలో విలీనం చేయరాదని సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.రాజయ్య మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో వీఆర్‌ఏలను కలిపితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. వీఆర్వోలు వీఆర్‌ఏల నిరసనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, సిద్దారెడ్డి, నాగరాజు, జైపాల్, వెంకటేశ్, పరమేశ్, అశోక్, దశరత్, అంజన్న పాల్గొన్నారు.

## శాంతినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

**జహీరాబాద్‌టౌన్:** ఆశారాం బాపుజీ ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ మందిరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఆశ్రమం నుంచి హోమియో వైద్యుడు రాధవల్లభ్‌యాదవ్ జహీరాబాద్‌కు వచ్చి రోగులను పరిశీలించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఆశ్రమ ప్రతినిధులు యాదవరెడ్డి, విఠల్‌రావు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్


**జహీరాబాద్‌టౌన్:** పట్టణంలోని శ్రీమాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య సిబ్బంది తట్టు, రుబెల్లా వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడారు. భవిష్యత్తులో పిల్లలకు రోగనిరోధక శక్తి పెరిగి తట్టు, రుబెల్లా లాంటి వ్యాధులు సోకకుండా ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఈ వ్యాక్సిన్‌ను ప్రతి విద్యార్థి వేసుకునే విధంగా చూస్తున్నామన్నారు.

# బాబానగర్ రోడ్డు బాగుచేయరా?


అధ్వానంగా మారిన బాబానగర్‌కాలనీ రోడ్డు

**జహీరాబాద్:** జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల బాబానగర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో బాబానగర్ కాలనీవాసులతో పాటు ఆ దారిగుండా వెళ్లే చాలా మందికి ఇబ్బందులు తప్పడం లేదు. రంజోల్ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి బాబానగర్ కాలనీ వరకు తారురోడ్డు లేకపోవడంతో ఆ కాలనీ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు ప్రజలు నరకం చూస్తున్నారు. దీంతో రంజోల్‌లోని పాలిటెక్నిక్ కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా రోడ్డు బాగులేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో మరింత దారుణంగా తయారవుతుంది. ఈ రోడ్డును బాగు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి చొరవ చూపడం లేదని ఆ కాలనీవాసులు తెలిపారు. ఈ రోడ్డును బాగు చేయడం లేదని ఆ కాలనీవాసులు రెండు నెలల క్రితం పెద్ద సంఖ్యలో 65వ జాతీయ రహదారిపై ధర్నా చేసేందుకు వచ్చారు. ధర్నా చేస్తారని ముందస్తు సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తయే విధంగా చూస్తామని హామీనిచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఆ రోడ్డు బాగు చేయలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోయి గాయాల పాలవుతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా రోడ్డు నిర్మాణం చేస్తామని వాగ్దానాలు చేసినప్పటికీ రోడ్డు నిర్మాణం కోసం ఏ ఒక్కరు కూడా చొరవ చూపడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బాబానగర్ రోడ్డును బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### తారు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు



తమ కాలనీకి రంజోల్ నుంచి తారు రోడ్డు లేకపోవడంతో గుంతలమయమైన ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రతి రోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాకాలంలో అయితే ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో రోడ్డు బాగు చేస్తామని హామీనిస్తున్నారే తప్ప ఇప్పటి వరకు తమ సమస్యను ఎవరు కూడా పరిష్కరించడం లేదు.

**- అభిషేక్ విద్యార్థి, బాబానగర్‌కాలనీ**

### కాలినడకన వెళ్లే పరిస్థితి ఏర్పడింది



గుంతలమయమైన ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలతో, సైకిల్‌పై వెళ్లలేని పరిస్థితి ఉంది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు, సైకిళ్లపై వెళ్లేవారు గుంతలను పసిగట్టక అదుపుతప్పి పడిపోయి గాయాలకు గురవుతున్నారు. దీంతో విద్యార్థులు కాలినడకనే కళాశాలలు, పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది..

**- దేవేందర్, విద్యార్థి, బాబానగర్‌కాలనీ**

# ఘనంగా గణనాథులకు పూజలు


పట్టణంలో వినాయకుడి పూజలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వై.నరోత్తం

**జహీరాబాద్:** పట్టణంలో వినాయక మండపాల వద్ద సందడి నెలకొంది. మండపాల్లో కొలుదీరిన గణనాథులు రోజుకో విధంగా ప్రత్యేక పూజలందుకుంటున్నారు. రాచన్నపేట, శ్రీరాంవీధి, మాణిక్‌ప్రభుమహల్లా, విద్యుత్ కాలనీ తదితర ప్రాంతాల్లో భక్తులు పూజలు చేస్తున్నారు. శాంతినగర్, రాంనగర్, గాంధీనగర్, ఆర్యానగర్, దత్తగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూసానగర్‌లోని స్వామి వివేకానంద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రోజూవారిగా పూజలు నిర్వహిస్తూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వై.నరోత్తం పాల్గొన్నారు. అలాగే ఆర్యనగర్‌లో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ నారాయణరెడ్డి కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు. దీంతో పాటు పట్టణంలోని ఆయా వినాయక విగ్రహాల వద్ద భక్తులు, వ్యాపారవేత్తలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**రాయికోడ్‌లో**

**రాయికోడ్:** రాయికోడ్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక మండపాల వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

రాయికోడ్‌లోని బాలగణేశ్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని మండపాల నిర్వాహకులు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని హస్నాబాద్, ఇందూర్, రాయిపల్లి, సిరూర్, మహబత్‌పూర్, చిమ్నాపూర్, కుస్నూర్, ఉల్గేర, శంశొద్దీన్‌పూర్, నల్లంపల్లి, పీపడ్‌పల్లి తదితర గ్రామాల్లో కూడా మండపాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మల్లికార్జున్‌పాటిల్, మండల టీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు చేవెళ్ల విఠల్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సతీశ్‌కుమార్, ఎంపీపీ అధ్యక్షుడు బి.వెంకట్‌రావు, ఆయా గ్రామాల సర్పంచులు, మండపాల నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.


వినాయకుడి పూజలో పాల్గొన్న వార్డు కౌన్సిలర్ నారాయణరెడ్డి

## బర్దీపూర్ గ్రామాన్ని సందర్శించిన జిల్లా ప్లాంటేషన్ అధికారి

**ఝరాసంగం:** మొక్కలు నాటడంలో ఇంత నిర్లక్ష్యమా అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా ప్లాంటేషన్ అధికారి మణికుమార్ బర్దీపూర్ గ్రామానికి వెళ్లి రోడ్డుపై వృథాగా పడవేసిన మొక్కలను పరిశీలించారు. మొక్కలు వృథాగా పడవేస్తే శాఖపరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు.

వృథాగా ఉన్న మొక్కలను వెంటనే నాటించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. అక్కడి నుంచి మండల కేంద్రమైన ఝరాసంగంకు వచ్చి ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు తీసుకెళ్లిన మొక్కలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనన్నారు. విధులను నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ ఎల్లయ్య, ఏపీవో అశోక్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్లాంటేషన్ అధికారి మణికుమార్

## రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని ధర్నా

**జహీరాబాద్‌టౌన్:** అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, రేషన్ షాపుల ద్వారా సరుకులను సరఫరా చేయరాదని, జీవో 14ను వెంటనే రద్దుచేయాలని కోరుతూ బుధవారం సీఐటీయూ నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ 60వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, మహిపాల్, అంగన్‌వాడీ కార్యకర్తలు శోభ, గౌరమ్మ, పద్మ, మల్లమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ భేష్

• మా రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలుచేస్తాం • 'మధ్యప్రదేశ్' ఇంజనీర్ల బృందం కితాబు

• కోమటిబండ సంపు, పెద్దారెడ్డిపేట నీటిశుద్ధి కేంద్రం పరిశీలన



పెద్దారెడ్డిపేట ఇన్‌టెక్ వెల్ నుంచి వచ్చే రా వాటర్ విధానాన్ని పరిశీలిస్తున్న ఇంజనీర్లు

**పుల్‌కల్ :** ప్రతి పల్లే తాగునీటి తాగునీటి అవసరాలను తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మిషన్ భగీరథ' పథకం అద్భుతంగా ఉందని మధ్యప్రదేశ్ ఇంజనీర్ల బృందం కితాబునిచ్చింది. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో మిషన్ భగీరథ పథకం కింద నిర్మిస్తున్న 'సంగారెడ్డి సెగ్మెంట్' నీటి శుద్ధి కేంద్రాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వ 'జల్ నిగం' సీనియర్ ఇంజనీర్ ఏకే శ్రీవాస్తవ నేతృత్వంలోని తొమ్మిది మంది ఇంజనీర్ల బృందం బుధవారం పరిశీలించింది. మంజీర బ్యాక్ వాటర్‌లో నిర్మించిన ఇన్‌టెక్ వెల్‌ను వారు పరిశీలించారు. అనంతరం నీటిశుద్ధి కేంద్రంలో నిర్మించిన ఫిల్టర్ బెడ్స్, క్లారిఫ్ల్యూక్లేటర్ 1, 2, ల్యాబ్స్, క్లోరినేషన్ గదులను సందర్శించారు. ఫిల్టర్ బెడ్ల దిగువ భాగంలో ఉపయోగించే ఇసుక, బొగ్గు, గులకరాళ్లు తదితర వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ విజయ్‌ప్రకాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధ్యప్రదేశ్ జల్ నిగం సీనియర్ ఇంజనీర్ శ్రీవాస్తవ మాట్లాడారు. గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని కేవలం రెండేళ్ల వ్యవధిలోనే మిషన్ భగీరథ పేరుతో తాగునీటిని సరఫరా చేయడం చాలా బాగుందన్నారు. ఈ పథకం తమను ఎంతగానో ఆకట్టుకున్నదని తెలిపారు. పనుల నిర్వహణలో వేగం, నాణ్యత, ప్రమాణాలు కఠినతరంగా ఉన్నాయని కితాబునిచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎప్పటికప్పుడూ నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ లేకుండా పర్యవేక్షించడం అభినందనీయమన్నారు. దేశంలో సగటున ప్రతి మనిషికీ రోజుకు 55 లీటర్ల చొప్పున నీటి కేటాయింపులున్నాయని వెల్లడించారు. అయితే, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో దానిని వంద లీటర్లకు డిజైన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించడం బేషుగ్గా ఉందన్నారు. రాను రాను తాగునీటితో పాటు మనిషికి ఇతర నీటి అవసరాలు కూడా అధికమవుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో మిషన్ భగీరథ పథకాన్ని సకాలంలో పూర్తి చేయడం గమనిస్తుంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల కృషికి నిదర్శనమన్నారు. ఇదే తరహాలో ఈ పథకాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే ఏడాది జూన్ నాటికల్లా సమృద్ధిగా తాగునీటిని అందించనున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ విజయప్రకాశ్ వివరించారు. మధ్యప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజనీర్లు పీకే రఘువంశీ, పంకజ్ విజయ్‌వర్గీయ, జీపీ గనోటి, సంజయ్ వాద్వా, శ్యాంవర్మ, ప్రశాంత్ శర్మ, విశాల్ మెహ్రా, ప్రదీప్ సిన్హాలు అధ్యయన బృందంలో ఉన్నారు. కాగా, మునిపల్లి మండలంలోని బుసారెడ్డిపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని కూడా పరిశీలించారు. వారి వెంట మెదక్ సెగ్మెంట్ ఈఈ సురేష్, సంగారెడ్డి సెగ్మెంట్ ఈఈ రఘువీర్, జహీరాబాద్ డిప్యూటీ ఈఈ ప్రశాంత్ కుమార్, ఏఈఈ కృష్ణ, ఎల్అండ్‌టీ ప్లాంట్ హెడ్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



కోమటి బండ పైలాన్ వద్ద బృందం





లేబోరేటరీ పరికరాలను పరిశీలిస్తున్న ఇంజనీర్లు, పెద్దారెడ్డిపేటలో నీటిశుద్ధి కేంద్రం గురించి వివరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ విజయ్‌ప్రకాశ్

## ఇంటింటికీ తాగునీటి పథకం అద్భుతం

**గజ్వేల్:** నల్లా ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించే మిషన్ భగీరథ పథకం భేష్ అని మధ్యప్రదేశ్ ఇంజనీర్ల బృందం సభ్యులు కితాబునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండలో సంపుహౌజ్‌ను మధ్యప్రదేశ్ ప్రభుత్వ 'జల్ నిగం' సీనియర్ ఇంజనీర్ ఏకే శ్రీవాస్తవ నేతృత్వంలో ఏకే శ్రీవాస్తవ, పీకే రఘువంశీ, పంకజ్ విజయ్‌వర్గీయాలతో కూడిన బృందం బుధవారం పరిశీలించింది. అనంతరం నల్లా ద్వారా నీటిని అందించే విధానాన్ని పరిశీలించేందుకు గిరిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నీటి సరఫరా విధానం, ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసే విధానాన్ని మిషన్ భగీరథ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా ఎస్ఈ విజయ్‌ప్రకాశ్, గజ్వేల్ ఈఈ రాజయ్యలు వారికి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ ఇంజనీర్ల బృందం మాట్లాడుతూ నల్లా ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించే పథకం ఆలోచన అద్భుతం అన్నారు. పరిశుద్ధమైన నీటిని ప్రజలకు అందించాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానం గొప్పదన్నారు. ఏ గొప్ప కార్యక్రమమైనా ఎవరో ఒకరు మొదలు పెట్టాలని, ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని అందించాలనే కార్యక్రమాన్ని తెలంగాణ సీఎం చేపట్టి, దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. తమ రాష్ట్రంలో సైతం ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని అందించే విధానాన్ని త్వరలో అమల్లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. నీరే మానవ జీవకోటికి ప్రాణాధారం అని, అలాంటి నీటిని ప్రతి ఇంటికీ అందిస్తున్న విధానం అద్భుతమన్నారు. వారి వెంట మిషన్ భగీరథ ఎస్ఈ విజయ్‌ప్రకాశ్, ఈఈ రాజయ్య, మధ్యప్రదేశ్ ఏఈలు జీపీ గానోటే, సంజయ్ వాధ్వా, శ్యాంవర్మ, ప్రశాంత్‌శర్మ, విశాల్‌మిశ్రా, ప్రదీప్‌మిశ్రా తదితరులున్నారు.

# పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

• న్యాక్ పీర్ టీం చైర్మన్ తనీజా

• హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

**సిద్ధిపేట టౌన్ :** సిద్దిపేట డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని న్యాక్ పీర్ టీం చైర్మన్ ప్రొఫెసర్ ఎన్‌కే.తనీజా అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో ఉన్న స్థితిగతులపై పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరించామని తెలిపారు. యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్)కి నివేదిక రూపంలో అందజేస్తామని చెప్పారు.పూర్వ విద్యార్థులు ఇచ్చినటువంటి ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. కళాశాల అభివృద్ధికి వారి తోడ్పాటు అభినందనీయమన్నారు.

పూర్వ విద్యార్థి ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ కళాశాల యూనివర్సిటీ స్థాయికి అభివృద్ధి చేయడానికి సహకారాన్ని అందించాలని న్యాక్ టీంను కోరారు. సాహితీ వేత్తలను, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ప్రజాప్రతినిధులను, అధికారులను, మేధావులను అందించిన చరిత్ర కళాశాలదన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో తాము చదువుకున్న రోజులను మరువలేమని, ఇక్కడ చదువుకుని ఈ స్థాయిలో ఉన్నామని చెప్పారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థి సంఘం చైర్మన్ పాపయ్య మాట్లాడుతూ కళాశాల గొప్ప వ్యక్తులను అందించిందన్నారు. కళాశాల అభివృద్ధిలో తాము ముందుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ఈ కళాశాలలోనే మంచి నడవడికను, జ్ఞానాన్ని నేర్చుకున్నానని తెలిపారు. అధ్యాపకులు నేర్పిన క్రమశిక్షణతోనే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ కళాశాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం మాట్లాడుతూ తన జన్మనిచ్చిన తల్లి తర్వాత అంతే గొప్ప స్థాయిలో కళాశాలను భావిస్తానని చెప్పారు. కళాశాల అభివృద్ధిలో ఎప్పుడు ముందుంటానని చెప్పారు. మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో కళాశాల మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ శ్రీరాములు, పద్మాదేవి, సురేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, డాక్టర్ రవిందర్‌రెడ్డి, శర్మ, హరికృష్ణ, గోపాలసుదర్శనం, డాక్టర్ రవిబాబు, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో ఉన్న రోజులను గుర్తు చేసుకుంటున్న ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్







సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, హాజరైన ప్రముఖులు, కళాశాల మిత్రులతో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## సిద్దిపేట డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ టీం

### కళాశాల ఔన్నత్యాన్ని వివరించిన ప్రిన్సిపాల్

యూజీసీ న్యాక్ పీర్ టీం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం పరిశీలించారు. కళాశాల గ్రేడ్ నిర్ధారించడం కోసం యూజీసీ నాక్ పీర్ కమిటీ చైర్మన్, ఉత్తర ప్రదేశ్‌లోని చౌదరి చరణ్ సింగ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌కే.తనీజా, తమిళనాడులోని జయరాజ్ అన్నపకీయం మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నిర్మల సందర్శించారు. మొదటగా కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం నాక్ పీర్ టీంకు స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కళాశాల ఔన్నత్యాన్ని వివరించారు. తర్వాత కళాశాలలో వివిధ సబ్జెక్టు విభాగాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అధ్యాపకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు వినియోగించుకుంటున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని సందర్శించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి చేస్తున్న కృషిని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కొక్కొండ ప్రభువు నాక్ పీర్ టీంకు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చె ందిన అధ్యాపకులు డాక్టర్ రమేశ్‌బాబు, అయోధ్యరెడ్డి, చెప్పెల హరినాథశర్మ, లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# అరచేతిలో ప్రపంచం

- సమగ్ర సమాచారమంతా స్మార్ట్‌ఫోన్‌లో
- ఇంటర్నెట్ కేంద్రాల్లో వ్యాపారం ఢమాల్
- మూతపడుతున్న షాపులు

**సిద్దిపేట కల్చరల్:** పెద్ద నగరాల నుంచి చిన్న పట్టణాల వరకు యువతను కనెక్ట్ చేసిన అడ్డా సైబర్ కేఫ్. ఇంటర్నెట్ రాకతో ప్రపంచం చిన్నదిగా మారిపోయింది. ఎక్కడ ఏమి జరిగినా క్షణాల్లో తెలిసిపోతోంది. బ్యాంకుల నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకు అన్నీ ఆన్‌లైన్ కావడంతో ఏ పనికైనా ఇంటర్‌నెట్ కేంద్రాలతో అవసరమేర్పడింది. ప్లేన్ టికెట్స్ నుంచి సినిమా టికెట్స్ వరకు అన్ని ఇంటర్‌నెట్‌తో ముడిపడిపోయాయి. దీంతో యువతే కాకుండా సామాన్యులు సైతం తమ పనుల నిమిత్తం ఇంటర్‌నెట్ కేంద్రాలకు పరిగెత్తారు. ఏ సైబర్ కేఫ్‌ను చేసినా సందడిగా కనిపించేవి. కానీ ఇదంతా గతం ప్రస్తుతం ఇంటర్‌నెట్ కేంద్రాలు వెలవెలబోతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల రూపంలో అరచేతిలోనే అన్నీ పనులను చేసుకుంటున్నారు. ఫలితంగా ఇంటర్నెట్ బ్రౌజింగ్ కేంద్రాలు కనుమరుగైపోతున్నాయి. వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో మూసివేస్తున్నారు.

## కళతప్పిన ఇంటర్నెట్ కేంద్రాలు

సిద్దిపేట పట్టణంలో 20కి పైగా ఇంటర్నెట్ బ్రౌజింగ్ కేంద్రాలు ఉండేవి. నేడు స్మార్ట్‌ఫోన్‌ల హవా నడుస్తుండడంతో 14కు పైగా ఇంటర్నెట్ కేంద్రాలను మూసివేశారు. మిగతా కేంద్రాలు కూడా వినియోగదారులు రాకపోవడంతో వెలవెలబోతున్నాయి. వేరే దారి లేక తప్పనిసరిగా కొందరు వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ నోటిఫికేషన్‌లు వచ్చినపుడు మాత్రమే ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. గతంలో ఉదయం నుంచి మొదలు రాత్రి వరకు వినియోగదారులతో కళకళలాడేవి. ప్రస్తుతం పలు టెలికం కంపెనీలు పోటీ పడి 2 జీ, 3 జీ, 4 జీ పేరుతో మొబైల్ డాటా ప్యాకేజీలు అందుబాటు ధరలోనే అందిస్తుడడంతో యువత, ఉద్యోగులు వారికి కావాల్సిన సమాచారాన్ని క్షణాల్లో పొందుతున్నారు. ఇంటర్నెట్ కేంద్రాలకు వెళ్లడమే మానేశారు. ఒక వేళ వెళ్లిన తమ మెయిల్ నుంచి ప్రింట్ తీసుకోవడానికి మాత్రమే వస్తున్నారు. మరికొందరు ఆన్‌లైన్ చెల్లింపులు ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్స్ కోసం వెళ్తున్న పరిస్థితి కనబడుతుంది.

## స్మార్ట్‌ఫోన్‌తో అన్నీ అందుబాటులోకి

రోజు రోజుకు మారుతున్న సాంకేతికతో పాటు స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగిపోతూనే ఉంది. డిగ్రీ, పీజీ, ఉన్నత చదువులు చదివే విద్యార్థుల నుంచి పాఠశాల విద్యార్థుల వరకు ఈ స్మార్ట్‌ఫోన్‌లను వినియోగిస్తున్నారు. చాట్ చేస్తూ, వాయిస్, వీడియో కాల్స్ చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ ద్వారా సమాజంలో జరుగుతున్న సమాచారంతో పాటు ఆన్‌లైన్ ద్వారా సినిమాలు, పాటలు, క్రీడలను వీక్షిస్తున్నారు. అంతేగాక నెట్ బ్యాంకింగ్, గ్యాస్ బుకింగ్, పేటీయం, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, ఆన్‌లైన్‌లోనే టికెట్ల బుకింగ్ తదితర సదుపాయాలతో సౌకర్యాలను పొందుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చే అసైన్‌మెంట్‌ను కూడా సెల్ ఫోన్ ద్వారా గూగల్ సెర్చ్ చేసే స్థాయికి వచ్చారు.

### మరో దారిలేక వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాం



15 సంవత్సరాల క్రితంతో పోల్చుకుంటే సాంకేతికంగా ఎంతో మార్పు వచ్చింది. గంట సేపు వినియోగదారుడు ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేస్తే రూ.30 తీసుకునేవాళ్లం. నేడు రూ.15 ఉన్నా ఎవరు రావడం లేదు. గతంలో వన్ ఎంబీ స్పీడుతో పది కంప్యూటర్లకు షేర్ చేసేవాళ్లం. నేడు పది ఎంబీపీఎస్ ఇచ్చిన నెట్‌వేగం లేదంటున్నారు. గతంలో రోజుకు 80 మంది బ్రౌజింగ్‌కు వచ్చేవారు. నేడు 10 మంది కూడా రావడం లేదు. జియో వచ్చాక పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ వ్యాపారంలోనే 15 సంవత్సరాల పైగా ఉన్నాం. ఆన్‌లైన్‌లో ఆధార్ నమోదు, టీఎస్పీఎస్సీ, ఎంసెట్ తదితర నమోదు ప్రక్రియను కొనసాగిస్తూ షాపు ను నడుపుతున్నాం. నాడు రిజల్ట్ కోసం విద్యార్థులు గంటల తరబడి క్యూలో నిలబడి వేచి చూసేవాళ్లు. నేడు కనీసం ఒక్కరు కూడా రావడం లేదు.

### స్మార్ట్‌ఫోన్‌తో ఎన్నో పనులు



స్మార్ట్‌ఫోన్‌లు వచ్చాక చాలా పనులు ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. ఉద్యోగ నోటిఫికేషన్లు, విద్యాపరంగా ఏమైనా అనుమానాలుంటే గూగుల్‌లో అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నాం. అంతేగాక ఇంటిపన్ను, విద్యుత్ బిల్లు మొదలైనవి చెల్లిస్తున్నాం. ఆన్‌లైన్‌లో వివిధ వ స్తువులు కొనుగోలు చేస్తున్నాం. స్మార్ట్ ఫోన్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావడంతో, ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లే సమస్య తప్పింది.

**ప్రవళిక, డిగ్రీ విద్యార్థిని, సిద్దిపేట**




స్మార్ట్ ఫోన్‌లో ఇంటర్‌నెట్ వినియోగిస్తున్న యువతులు, సిద్దిపేట ఇంటర్‌నెట్ కేంద్రంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

### ఫోన్..మినీ కంప్యూటర్



స్మార్ట్‌ఫోన్ మినీ కంప్యూటర్‌లా పనిచేయడం వల్ల ఆన్‌లైన్ సేవలన్నీ అరచేతిలో అందుతున్నాయి. గతంలో బంధువుల క్షేమ సమాచారాలు తెలుసుకోవాలంటే ఉత్తరాల ద్వారా తెలిసేది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పలు యాప్‌ల ద్వారా నేరుగా మాట్లాడుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఎక్కడ చూసినా స్మార్ట్‌ఫోన్‌లోనే అన్ని సేవలు లభిస్తున్నాయి.

**సౌందర్య, డిగ్రీ విద్యార్థిని, సిద్దిపేట**

# కొండపోచమ్మా..నీవే దిక్కు!

- బ్యాంకు రుణాలు చెల్లించని రైతులు
- పరిహారం తీసుకుని బ్యాంకు ముఖం చూడరు
- రూ.7.50 కోట్ల రుణాల రికవరీ అంతేనా ?
- తలలు పట్టుకున్న గ్రామీణ వికాస్ బ్యాంక్ అధికారులు



కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మించే పాములపర్తి చెరువు

**మర్కుక్ :** కొండపోచమ్మ ప్రాజెక్టు కోసం భూముల సేకరణ చేపట్టడం బ్యాంకర్ల పాలిట శాపంగా మారింది. ఆయా గ్రామాల రైతులకు రుణాలు ఇచ్చిన బ్యాంకర్లు అవి ఎలా వసూలు చేసుకోవాలో తెలియక తల పట్టుకుంటున్నారు. భూములు పోయిన తర్వాత రైతుల రుణ బకాయిలు ఎలా రాబట్టుకోవాలని అర్థంకాని పరిస్థితిల్లో కొట్టుమిట్టాడుతున్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్, ములుగు మండలాల్లో ప్రాజెక్ట్ ముంపు గ్రామాల పరిధిలో రైతులకు అప్పు ఇచ్చిన బ్యాంకుల అవస్థ ఇది.

కొండపోచమ్మ ప్రాజెక్ట్ కోసం మండలంలోని పాములపర్తి చెరువును ఎంపిక చేసుకున్నారు. ఇందులో ప్రధానంగా ములుగు మండలంలోని మామిడ్యాల, బైలింపూర్, తానేదార్‌పల్లి, తాండా, గ్రామాలతో సహా వ్యవసాయ భూములు కూడా ముంపునకు గురవుతున్నాయి. మర్కుక్ మండలంలోని పాములపర్తి, మర్కుక్ గ్రామాల్లోని వ్యవసాయ భూములు ముంపుకు గురవుతున్నాయి. అయితే ఈ గ్రామాలన్నీ గౌరారం గ్రామీణ వికాస్ బ్యాంక్ పరిధిలోకి వస్తాయి. బ్యాంకు ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడి రైతులకు, మహిళా సంఘాలకు, ఇతర స్వయం ఉపాధి పథకాలకు ఈ బ్యాంకు ద్వారానే లావాదేవీలు కొనసాగుతున్నాయి. మామిడ్యాల, బైలింపూర్, తానేదార్‌పల్లి, తాండా గ్రామాలకు సంబంధించిన 527 మంది ఖాతాదారులు ఉన్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.5.5కోట్ల రుణాలు రైతులకు అందజేశారు. అదే విధంగా పాములపర్తి, మర్కుక్ గ్రామాలకు సంబంధించి 582 రుణ ఖాతాలు ఉండగా రూ. 2.08 కోట్లు బకాయిలు ఉన్నాయి. సాధారణంగా పంట రుణాలు ఇచ్చే సందర్భంలో బ్యాంకర్లు పట్టాదార్ పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్‌లు, సెక్యూరిటీ పేరిట తమ వద్ద ఉంచుకొని రుణాలు ఇస్తుండడం సర్వసాధారణం. ఇదే విధంగా ముంపు రైతుల భూముల పాసుపుస్తకాలన్నీ బ్యాంకులలో ఉన్నాయి. అయితే ముంపు భూముల సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలనే ధోరణిలో రెవెన్యూ యంత్రాంగం ఆయా రైతుల భూములను బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా ఒక డ్రైవ్ మాదిరిగా చకచకా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఆయా రైతులకు పరిహారం చెక్కులను ఎకరానికి రూ.12 లక్షల చొప్పున అందజేశారు. చెక్కులు తీసుకున్న రైతులు తాము బకాయిలు ఉన్న బ్యాంకుల జోలికి వెళ్లకుండా ఇతర బ్యాంకులలో డిపాజిట్ చేస్తున్నారు. ఈ అంశమే బ్యాంకర్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. భూములు ప్రాజెక్టులో పోయి పరిహారం రైతుల చేతిలో పడితే తమ బ్యాంకులో రైతుల పేరిట ఉన్న దాదాపు ఏడున్నర కోట్ల రుణ బకాయిల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఏమీ పాలుపోని స్థితిలో బ్యాంకర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇక మాకు కొండపోచమ్మే దిక్కు అని అమ్మవారిపై భారం వేసి చూస్తున్నారు.

# 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. **'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)
2. **చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)
3. **పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)
4. **ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?**
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) పకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్షియానో(అమెరికా)
5. **ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?**
ఎ) హర్వే బి) చార్లీ సి) కోర్సన్ డి) కార్లా
6. **భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్
7. **ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'సంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?**
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్
8. **తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?**
ఎ) కుప్వారా బి) కదువా సి) కార్గిల్ డి) రాజౌరి
9. **అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?**
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్
10. **రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?**



ఎ) ఫై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా
11. **జాతీయ క్రీడా దినోత్సవం?**
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30
12. **ఇటీవల మరణించిన టోని డిబ్రమ్‌కి సంబంధించి సరైనది?**
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ
13. **101 ఏళ్ళ వయసులో ఇటీవల మరణించిన రామనందసేన్ గుప్తా ఎవరు?**
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత
14. **ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?**
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్
15. **ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూలల్
16. **దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?**
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై
17. **ఇన్ఫోసిస్ నూతన ఛైర్మన్?**
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ భంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి
18. **'గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు'గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?**
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణ్‌బీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

## జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

19. **ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?**
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి
20. **దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ 'విస్తారా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?**
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కోర్సికా(ఫ్రాన్స్)
21. **రైల్వే బోర్డు నూతన ఛైర్మన్?**
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్మృతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహని
22. **ఒడిశా ప్రభుత్వం అందించే 'బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్'ని 2016కి గాను పొందింది?**
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.వి.మోహన్‌రావు
23. **తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?**
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి
24. **కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'స్వస్థ బచ్చే స్వస్థ భారత్'ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?**
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అసోం)
25. **ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?**
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి)సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)
26. **ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?**
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ
27. **ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?**
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్
28. **జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?**
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్
29. **లింగ సమానత్వం కోసం 'జండర్' ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?**
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా
30. **భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి 'విదేశీభవన్'ను ఏ నగరంలో ప్రారంభించారు?**
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు
31. **ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?**
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా
32. స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత?



ఎ) నటాషా బి) తాలాయ్
సి) రవీణ డి) లటిసియా
33. **ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?**
ఎ) ఫిజి బి) నౌరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు
34. **2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?**
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ
35. **నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?**
ఎ) మెచి నది బి) తమూర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది
36. **షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?**
ఎ) పోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హాంగ్జో(చైనా)
డి) జోహాన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)
37. **2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?**
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్
38. **బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?**
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్
39. **'జాట్'లను ఒబిసి జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?**
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్
40. **2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

**సమాధానాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) సి | 7) డి | 13) బి | 20) ఎ | 27) బి | 34) బి |
| 2) డి | 8) డి | 14) సి | 21) డి | 28) ఎ | 35) ఎ |
| 3) బి | 9) ఎ | 15) బి | 22) బి | 29) డి | 36) డి |
| 4) ఎ | 10) బి | 16) బి | 23) బి | 30) ఎ | 37) సి |
| 5) ఎ | 11) బి | 17) సి | 24) ఎ | 31) డి | 38) బి |
| 6) బి | 12) డి | 18) సి | 25) బి | 32) ఎ | 39) డి |
| | | 19) ఎ | 26) డి | 33) డి | 40) బి |

## JOBS ఉద్యోగాలు

### ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 173
**పోస్టుల వారీ ఖాళీలు:** స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
**అర్హత:** ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
**వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
**ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎఫిషియెన్సీ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్స్‌క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
**అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 14
**సిబిటి నిర్వహించే తేదీ:** అక్టోబరు 29
**దరఖాస్తు ఫీజు:** రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 25
**వెబ్‌సైట్:** www.asrb.org.in, www.icar.org.in

### ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
**ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్**
**అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.
**గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్**
**అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి
**ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్**
**అర్హత:** ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
**ఇమెయిల్:** recruitment@iiits.in
**వెబ్‌సైట్:** www.iiits.ac.in

### ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
**ఖాళీలు:** 5
**పోస్టులు:** జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్‌టి 1, ఆర్థోపెడిక్స్ 1)
**కాంట్రాక్ట్ వ్యవధి:** ఆరు నెలలు
**అర్హత - వేతనం:** సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.
**ఇంటర్వ్యూ:** సెప్టెంబరు 13న
**వేదిక:** Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli
